Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :69 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 19 జూలై 2026 పేజీలు :12 వెల రూ5 /-


## క్రీడాకారిణి ప్రవల్లికను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:**చైనాలోని ఒర్డోస్లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్-2026లో మహిళల 4x400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్హెచ్ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## నీట్ ర్యాంకర్లను అభినందించిన సీఎం రేవంత్



**హైదరాబాద్:**నీట్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి విద్యార్థులు ఎంసీఆర్హెచ్ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.


## దేశ అంతరిక్ష కలలకు
# చిరునామాగా తెలంగాణ

### విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్-1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:**పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1ను విజయవంతంగా పరీక్షించిన స్కైరూట్ ఏరోస్పేస్కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మిషన్ ఆగమన్లో భాగంగా నిర్వహించిన విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్-1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని, తెలంగాణకు గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్కు చెందిన స్పేస్-టెక్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ సాధించిన ఈ విజయం దేశం అంతరిక్ష సాంకేతిక రంగంలో సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. అంతరిక్ష అన్వేషణలో భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ఘనత స్కైరూట్కు దక్కిందని ప్రశంసించారు. ఈ ఏడాది ఏప్రిల్లో శంషాబాద్లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్లో ఉన్న స్కైరూట్ ఏరోస్పేస్ మ్యాక్స్-క్యూ క్యాంపస్ను సందర్శించిన సందర్భంగా, మిషన్ ఆగమన్ ప్రయోగ కార్యక్రమానికి ముందు విక్రమ్-1 ఫ్లైట్ హార్డ్వేర్ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ముఖ్యమంత్రి గారు గుర్తు చేశారు. విక్రమ్-1 విజయవంతమైన టెస్ట్ ఫ్లైట్ తెలంగాణను ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశలో మరో కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ



విజయం ద్వారా ఏరోస్పేస్ ఆవిష్కరణలు, అధునాతన తయారీ రంగం, తదుపరి తరం అంతరిక్ష సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణ అనువైన గమ్యస్థానంగా మరింత బలపడిందని ముఖ్యమంత్రి తెలిపారు. స్కైరూట్ వంటి సంస్థల విజయాలు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించి, భావితర ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిస్తాయని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు



# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి**

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య**

**పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి**

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా - మిగతా3లో

## కమలానికి ట్రబుల్
# షూటర్ కావలెను...

**హైదరాబాద్, జూలై 18:**తెలంగాణ రాజకీయ చిత్రపటంపై కమలం పార్టీ వేగంగా విస్తరిస్తోంది. గత కొన్ని ఎన్నికల సరళిని గమనిస్తే బీజేపీ ఓటు బ్యాంకు, సీట్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఒకప్పుడు నామమాత్రపు ఉనికికే పరిమితమైన పార్టీ, నేడు 8 పార్లమెంటు స్థానాలను గెలుచుకునే స్థాయికి చేరిందంటే రాష్ట్రంలో ఆ పార్టీ ప్రాభవం ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలను చూసిన తెలంగాణ ఓటర్లు... కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని, పార్టీ అందిస్తున్న హిందుత్వ నినాదాన్ని నమ్మి ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, ఇంత సానుకూల వాతావరణం ఉన్నా, రేపటి ఎన్నికల్లో అధికారం హస్తగతం చేసుకోవాలనే బీజేపీ కల నిజమవ్వడానికి ఒక పెద్ద అడ్డంకి పదే పదే తెరపైకి వస్తోంది. అదే... సమర్థవంతమైన, రాష్ట్ర స్థాయి 'మాస్ లీడర్' లేకపోవడం.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో ఓటు బ్యాంకు పెరుగుతున్న మాట వాస్తవమే అయినా, దానిని



క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చి పోలింగ్ బూత్ వరకు నడిపించే బలమైన వ్యూహకర్త, ప్రజాకర్షక నాయకుడు కరవయ్యారు. ప్రత్యర్థి పార్టీలను గమనిస్తే... కాంగ్రెస్కు రేవంత్ రెడ్డి లాంటి దూకుడున్న మాస్ లీడర్ ఉన్నారు. బీఆర్ఎస్ వైపు చూస్తే కేసీఆర్ చరిష్మాతో పాటు కేటీఆర్, హరీశ్ రావు లాంటి వాగ్ధాటి, జనాలను ఆకట్టుకునే నేతలున్నారు. కానీ బీజేపీలో మైకు పడితే జనాలను తనవైపు - మిగతా3లో

## 'ఇప్పటి వరకు ఒక లెక్క..
# ఇక నుంచి మరో లెక్క'..

**సీఎం రేవంత్కు కేటీఆర్ సవాల్**

**ఉద్యోగాలపై కాంగ్రెస్ను నిలదీసిన కేటీఆర్**

**70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్**

**నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ**

**హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య**

**యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్**



తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల' స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది" అని హెచ్చరించారు. "ఇప్పటి వరకు ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం - మిగతా3లో

# బండి,ఈటల మధ్య కుదిరిన సయోధ్య

**హైదరాబాద్, జులై 18:** తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు.వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో



ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు.భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## చరిత్ర సృష్టించిన
# విక్రమ్-1..

### స్కైరూట్ బృందాన్ని ప్రశంసించిన ప్రధాని



ఇంటర్నెట్ డెస్క్: భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు మోదీ. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి - మిగతా3లో

## తెలంగాణ,ఏపీలో
# 6 రోజుల పాటు వర్షాలు




బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడటంతో ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో జులై 23 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.తెలంగాణలోని పలు జిల్లాలతో పాటుగా ఏపీలోని కోస్తా ఆంధ్ర,యానాం, రాయలసీమ,తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,ఉరుములు, మెరుపులు,గంటకు 50--70 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో జులై 21 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.బీచ్‌ల వద్ద అలలు ఉధృతంగా ఉండనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది

## తెలంగాణలో ఆహార, ఔషధ
# కల్తీలపై ఉక్కుపాదం..

### కఠిన చట్టానికి సీఎం రేవంత్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జులై 18:** తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీ సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక - మిగతా3లో



# సంపాదకీయం

## ఇస్రోలో ఏం జరుగుతోంది,...

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఆర్వో) ఇటీవలి నెలల్లో తన అనుభవజ్ఞులైన సైంటిస్టులను కోల్పోతోంది. ఈ పరిణామం దేశంలోని అత్యంత ముఖ్యమైన అంతరిక్ష కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీవోఎస్) తక్షణ చర్యలు తీసుకుంటోంది.కొన్ని నెలలుగా ఐఎస్ఆర్వో నుంచి 100 నుంచి 120 మంది సైంటిస్టులు రాజీనామా చేశారు. ఇందులో అనుభవం, నైపుణ్యం ఉన్న వారు కూడా ఉన్నారు. వంద మందికిపైగా సైంటిస్టులు ఇస్రోను వీడడం మామూలు విషయం కాదు. సంస్థలో ప్రతీ సైంటిస్టు పని అనుభవం, జ్ఞానం అనేది సంస్థకు ఒక ఆస్తి. వంద మందికిపైగా సంస్థను వీడడం మిషన్ల నాణ్యత, టైమ్‌లైన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది.భారతదేశం మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)వంటి చారిత్రాత్మక మిషన్లను చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టులలో పనిచేసే సైంటిస్టులు రాజీనామా లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ కోరినప్పుడు, వాటిని వెంటనే ఆమోదించవద్దని ఇస్రో కేంద్రాలకు డీవోఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదులుగా, అలాంటి అభ్యర్థనలను డీవోఎస్‌కు పంపి, అక్కడి నుంచి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది సాధారణ ఆదేశం కాదు. కీలక మిషన్లలో పనిచేసే నిపుణులను త్వరగా కోల్పోకుండా రక్షించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్య.డీవోఎస్ జోక్యం చేసుకోవడం రెండు విషయాలను స్పష్టం చేస్తోంది. ఒకటి ఇస్రోలోని అనుభవజ్ఞులైన సైంటిస్టులను నిలుపుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకుంది. రెండోది సంస్థలోని మానవ వనరుల నిర్వహణను కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. ప్రతి రాజీనామా అభ్యర్థనను వ్యక్తిగతంగా పరిశీలించి, సంస్థకు అవసరమైన నైపుణ్యాలను కాపాడుకోవాలన్నది ఈ ఆదేశాల ముఖ్య ఉద్దేశం. ఇది సంస్థలోని పని వాతావరణం, పరిహారం, కెరీర్ అవకాశాల వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.ఇస్రో వంటి సంస్థలో సైంటిస్టుల రాజీనామాలు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు మాత్రమే కావు. అవి సంస్థలోని నిర్వహణ, ప్రోత్సాహకాలు, బాహ్య అవకాశాలు వంటి విస్తృత కారణాలను ప్రతిబింబిస్తాయి. అనుభవజ్ఞులైన వారు బయటకు వెళ్లడం వల్ల కొత్తగా వచ్చే వారికి ఆ జ్ఞానాన్ని బదిలీ చేయడం కష్టమవుతుంది. పని ఒత్తిడి తగ్గించడం, మెరుగైన పరిహారం, కెరీర్ వృద్ధి అవకాశాలు, ప్రైవేట్ రంగంతో పోటీపడే విధంగా విధానాలు రూపొందించడం వంటివి ఆలోచించాల్సిన అవసరం ఉంది.ఇస్రో భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు మూలస్తంభం. దాని విజయం సైంటిస్టుల ప్రతిభ, అంకితభావంపై ఆధారపడి ఉంది. డీవోఎస్ ఇచ్చిన ఆదేశాలు ఈ ప్రతిభను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది కేవలం ఆదేశాలతో మాత్రమే సాధ్యం కాదు. సంస్థలోని వాతావరణం, అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే దీర్ఘకాలికంగా ప్రతిభావంతులను నిలుపుకోవచ్చు.ఇస్రో మెమో గురించి అడిగిన ప్రశ్నకు సింగ్ సమాధానమిస్తూ.. అది కేవలం పరిపాలనా కారణాలతోనే జరిగిందని చెప్పారు. "లేదు, అది ఎందుకంటే... మరింత పరిణతి చెందిన స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా పరిపాలనా కారణాల వల్ల అలా చేశాం" అని కేంద్ర మంత్రి అన్నారు. ఇస్రోలో చాలా మంది ఉద్యోగులు ఉన్నారని, కొందరు వెళ్లిపోతుంటే మరికొందరు కొత్తగా చేరుతుంటారని ఆయన అన్నారు. "చాలా మంది వెళ్లారు, చాలా మంది వచ్చారు" అని చెబుతూ ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదని ఆయన స్పష్టం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో ఏమీ జరగనప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు.ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెన్నైకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అబ్జర్వర్‌గా చేరారు. జనవరి 2025 వరకు ఇస్రో ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలోనే జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్, భారత్ తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య- ఎల్1 వంటి పలు చారిత్రాత్మక మిషన్లు చేపట్టారు.ఇక, భారత భవిష్యత్తు అంతరిక్ష మిషన్లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. గతంలో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. "దాదాపు పదేళ్ల కిందట జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి ఒక మనిషిని పంపడం సులభమే కానీ, తిరిగి సురక్షితంగా తీసుకురావడం కూడా అంతే కష్టంతో కూడుకున్న పని అని చెప్పారు.. ఆ విధంగానే క్రూ మాడ్యూల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు సోమనాథ్ ఆ పదవిలో లేనంత మాత్రాన గగన్‌యాన్ మిషన్ ఆగిపోయిందని అర్థం కాదు. అలా జరగదు కూడా. పైగా ఇస్రోలో పనులు నిరంతరాయంగా సాగుతాయి. పదవీవిరమణ చేసినవారు, మాజీ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా కొనసాగుతారు. అక్కడ పని సంస్కృతి చాలా భిన్నంగా ఉంటుంది" అని జితేంద్ర సింగ్ అన్నారు.యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ , విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి ఇస్రో కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సోమవారం జారీ చేసిన అంతర్గత మెమోలో కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రతిష్టాత్మక మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్', ఇతర ముఖ్యమైన మిషన్లతో ముడిపడి ఉన్న గ్రూప్ 'ఎ' సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామాలను లేదా స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలను సాధారణ పద్ధతిలో ఆమోదించవద్దని ఆదేశించింది.

## కన్నబిడ్డను అమ్మి.. కిడ్నాప్ నాటకం ఆడిన తల్లిదండ్రులు

**మహబూబ్‌నగర్‌లో 15 రోజుల పసికందు అమ్మకం**

**లక్ష రూపాయలకు బిడ్డను అమ్ముకున్న తల్లిదండ్రులు**

**బిడ్డ కిడ్నాప్ అయిందంటూ పోలీసులకు ఫిర్యాదు**

**దర్యాప్తులో అసలు నిజం వెల్లడి.. ఇద్దరిపై కేసు**



కన్నబిడ్డను లక్ష రూపాయలకు విక్రయించి, ఆపై శిశువు కిడ్నాప్‌నకు గురైనట్లు నాటకమాడిన అమానవీయ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో కలకలం రేపింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలం, తెలుగుగూడెం ప్రాంతానికి చెందిన కేశవులు, నీలమ్మ దంపతులకు 15 రోజుల క్రితం శిశువు జన్మించింది. అయితే, జూలై 13న తాము బయటకు వెళ్లిన సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బిడ్డను అపహరించుకుపోయారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనపై విచారణ చేపట్టిన ఐసీడీఎస్ అధికారులకు తల్లిదండ్రుల ప్రవర్తనపై అనుమానం కలగడంతో, వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బిడ్డ కిడ్నాప్ అవలేదని, తల్లిదండ్రులే స్వయంగా తరుణ్, భీమయ్య అనే ఇద్దరు వ్యక్తులకు లక్ష రూపాయలకు శిశువును విక్రయించినట్లు తేలింది.దీంతో పోలీసులు తరుణ్, భీమయ్యలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 137 కింద కేసు నమోదు చేశారు. వారిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం బిడ్డ తల్లిదండ్రులు కేశవులు, నీలమ్మలపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## మిషన్ ఆగమన్' ప్రయోగం విజయవంతం

**దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్-1'**

**శ్రీహరికోట, జూలై 18:**'మిషన్ ఆగమన్' ద్వారా భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేటు సంస్థ అయిన ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1'ను శనివారం ఉదయం 11.30 గం.లకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని(షార్) ఒకటో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపారు. మిషన్ ఆగమన్ పేరిట చేపట్టిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగ కార్యక్రమాన్ని షార్ లోని ఇస్రో లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ తో కలిసి వీక్షించారు. దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా ఆర్బిటాల్ విక్రమ్-1ను అభివృద్ధి చేశారు. స్కైరూట్ అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్, త్రీడీ ప్రింటెడ్ ఇంజన్లు, ఘన ఇంధన రాకెట్ బూస్టర్లు అమర్చారు. సుమారు 350 కిలోల బరువున్న నాలుగు చిన్న ఉపగ్రహాలను 450 కి.మీల ఎత్తులోని భూ నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా విక్రమ్-1ను డిజైన్ చేశారు. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ కు చెందిన 'స్కోప్' ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లారు. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ కు చెందిన కాస్మిక్ బ్లూమ్ అనే కళాకృతిని, మరో మైక్రో-ఆర్ట్ పీస్ ను పంపారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చును తగ్గించడంతో పాటు ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్-1 రాకెట్ ను రూపొందించారు. భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ



ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది.'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**'విక్రమ్-1' ప్రత్యేకతలు**

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది. ఈ తొలి ప్రయోగంలో గ్రాహా స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ ఛైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి.ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు. 2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.ఈ కార్యక్రమంలో స్కైరూట్ ఏరోస్పేస్ కో-ఫౌండర్, సీఈవో పవన్ కుమార్ చందన, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కే.నారాయణ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. రూ.10, రూ.20 నోట్లపై పైలట్ ప్రాజెక్ట్

**ముంబై, జూలై 18:**భారత కరెన్సీ స్వరూపాన్ని మార్చే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక ముందడుగు వేసింది. దేశంలో మరింత మన్నికైన, సురక్షితమైన పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తక్కువ విలువ కలిగిన నోట్ల కోసం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన ప్రత్యేక ముడిపదార్థం సరఫరా కోసం ఆర్బీఐ అనుబంధ సంస్థ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది.ఆర్బీఐ కరెన్సీ ముద్రణ విభాగమైన భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఆర్బీఎన్ఎంపీఎల్), ఈ గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ)ను నేడు జారీ చేసింది. అధునాతన భద్రతా ఫీచర్లను కలిగి ఉండే ఒపాసిఫైడ్ బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీప్రొఫైలిన్ (బీఓపీపీ) పాలిమర్ షీట్ల కోసం ఈ టెండర్ పిలిచారు. రెండు వేర్వేరు డినామినేషన్ల కోసం మొత్తం 68,000 రీముల (ఒక్కోదానికి 34,000 రీములు) మెటీరియల్ అవసరమని పేర్కొన్నారు. బిడ్లు దాఖలు చేయడానికి ఆగస్టు 18ని చివరి తేదీగా నిర్ణయించారు.

**తొలుత రూ.10, రూ.20 నోట్లతో ప్రయోగం**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పైలట్ ప్రాజెక్టులో భాగంగా మొదట రూ.10, రూ.20 నోట్లను పరీక్షించే అవకాశం ఉంది. మార్కెట్లో ఈ నోట్ల చలామణి ఎక్కువగా ఉండటం, ఇవి త్వరగా పాడైపోతుండటంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఫీల్డ్ ట్రయల్స్ వచ్చే ఏడాది ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇవి విజయవంతమైతే 2027 నుంచి దశలవారీగా ప్లాస్టిక్ నోట్లను విస్తృతంగా చలామణిలోకి తీసుకురావొచ్చని భావిస్తున్నారు. అయితే, దీనిపై ఆర్బీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, ప్లాస్టిక్ నోట్ల ప్రతిపాదన ప్రాథమిక పరిశీలనలో ఉందని, వాటి లాభనష్టాలను అంచనా వేస్తున్నామని వెల్లడించారు.ప్రస్తుతం దేశంలో వాడుతున్న కరెన్సీ నోట్లను 100% కాటన్ ఆధారిత కాగితంతో ముద్రిస్తున్నారు. ఇవి రోజువారీ వాడకంలో త్వరగా చిరిగిపోవడం, మురికిగా మారడం జరుగుతోంది. దీనివల్ల ప్రతి ఏటా కొన్ని కోట్ల సంఖ్యలో పాత నోట్లను ఆర్బీఐ వెనక్కి తీసుకుని నాశనం చేయాల్సి వస్తోంది. ఆర్థిక సంవత్సరం 2025లో కరెన్సీ ముద్రణ ఖర్చు రూ. 6,372.8 కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాది ఇది రూ. 5,101.4 కోట్లుగా ఉండేది. ఈ నేపథ్యంలో, మన్నికైన పాలిమర్ నోట్ల వైపు ఆర్బీఐ దృష్టి సారించింది.పాలిమర్ నోట్లు కాగితం నోట్ల కంటే రెండు నుంచి ఐదు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. దీంతో దీర్ఘకాలంలో ముద్రణ, పంపిణీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఇవి శుభ్రంగా ఉండటంతో పాటు, నకిలీ చేయడం కష్టతరం చేసే క్లియర్ విండోస్ వంటి అదనపు భద్రతా ఫీచర్లను కలిగి ఉంటాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా,



బ్రిటన్, కెనడా సహా 50కి పైగా దేశాలు ప్లాస్టిక్ నోట్లను విజయవంతంగా ఉపయోగిస్తున్నాయి.భారత్‌లో ప్లాస్టిక్ నోట్ల ప్రయోగం ఇదే మొదటిసారి కాదు. 2012లో రూ.10 విలువైన 100 కోట్ల ప్లాస్టిక్ నోట్లను కొచ్చి, మైసూర్, జైపూర్ వంటి నగరాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని భావించినా, సాంకేతిక కారణాలతో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. తాజా టెండర్‌లో ఆర్బీఐ కఠినమైన నిబంధనలను విధించింది. చైనా, పాకిస్థాన్‌లలో కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలకు ఇందులో పాల్గొనే అర్హత లేదని, ఆ దేశాల నుంచి ముడిసరుకును సేకరించరాదని స్పష్టం చేసింది. అలాగే, సరఫరా చేసే మెటీరియల్‌లో జంతువుల కొవ్వు ఉండకూడదని కూడా పేర్కొంది.

## తిరుమల దర్శనానికి 30 గంటల సమయం

**తిరుమల, జూలై 18:**కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తిరుమల గిరులకు పోటెత్తారు. వారాంతానికి ముందే భక్తుల తాకిడి అనూహ్యంగా పెరగడంతో తిరుమల కొండ కిటకిటలాడుతోంది. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 24 నుంచి 30 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.భక్తుల రద్దీ కారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు బయట వరకు బారులు తీరాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.నిన్న గురువారం (జూలై 16) ఒక్కరోజే 63,556 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 35,900 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.31 కోట్లుగా నమోదైంది. టీటీడీ అధికారులు 4.12 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.55 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. అలాగే, 4,051 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు టీటీడీ తెలిపింది.

# మహేష్ గౌడపై వేటు తప్పదా

**హైదరాబాద్, జూలై 18 :**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ అంతర్గత వ్యవహారాలు మాత్రం గాంధీభవన్‌ను కుదిపేస్తున్నాయి. రోజురోజుకూ పెచ్చుమీరుతున్న గ్రూపు రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను సమన్వయపరిచే ఒక సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను మార్చడం ఒక్కటే దీనికి పరిష్కారమనే చర్చ ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది.ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కాంగ్రెస్ హైకమాండ్‌కు తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డులో జూనియర్లకు పదవులు కట్టబెట్టి, పార్టీని నమ్ముకున్న సీనియర్లకు మొండిచేయి చూపించారనే అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తమవుతోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో కనీసం తమకు సమాచారం లేకుండానే నియామకాలు జరగడంపై సీనియర్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్న సమస్యలను ప్రాథమిక



దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ పూర్తిగా విఫలమయ్యారంటూ సీనియర్లు భావిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించాల్సిన ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌ను గాడిలో పెట్టాలంటే నాయకత్వ మార్పు అనివార్యమనే సంకేతాలు అందుతున్నాయి. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ తీవ్రంగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టి, పార్టీ కేడర్‌లో భరోసా నింపే కొత్త సారథి కోసం అన్వేషణ మొదలైనట్లు టాక్. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, పీసీసీ పగ్గాలు ఎవరికి దక్కుతాయో చూడాలి.

**ముదురుతున్న గొడవలు**

తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో ప్రభుత్వ పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో గాంధీభవన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం వల్లే పార్టీలో ఈ అంతర్గత సంక్షోభం ముదురుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డు నియామకంలో తమకు సరైన ప్రాధాన్యత దక్కలేదని, జూనియర్లకు పదవులు కట్టబెట్టారని పార్టీ కోసం ఎప్పటి నుంచో నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో తమకు తెలియకుండానే నియామకాలు జరగడంపై వారు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్నా సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ సామర్థ్యం సరిపోవడం లేదంటూ సీనియర్లు భావిస్తున్నారు. సమస్యల తీవ్రతపై నివేదికలు సిద్ధం చేసి, రాష్ట్ర స్థాయిలోనే సెటిల్ చేయాల్సింది పోయి.. ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలను మార్చాలనే ప్రచారం ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# ఏపీకి రికార్డులు అందించిన వక్ఫ్

**హైదరాబాద్, జూలై 18:**రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఒక కీలక వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వేలాది వక్ఫ్ ఆస్తుల రికార్డులను తెలంగాణ వక్ఫ్ బోర్డు ఏపీకి అప్పగించింది. ఈ బదలాయింపుతో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి మొత్తం 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ వాల్యూమ్‌లతో పాటు ఇతర కీలక పత్రాలను ఏపీ వక్ఫ్ బోర్డు అధికారులు స్వీకరించారు. ఇదొక చారిత్రక మైలురాయి అని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన కీలక ఆధారాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో వక్ఫ్ చట్టం-1995 నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, నిధులు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ దశాబ్ద కాలానికి పైగా స్తంభించిపోయింది. కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆస్తుల యాజమాన్య హక్కులను నిర్ధారించడం, ఆక్రమణలను నిరోధించడం, న్యాయస్థానాల్లో కేసులను సమర్థవంతంగా వాదించడం ఏపీ వక్ఫ్ బోర్డుకు పెను సవాలుగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారంతో పాటు, తాము జరిపిన ఉన్నత స్థాయి చర్చలు ఫలించాయని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఈ రికార్డుల లభ్యతతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇదే క్రమంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీకి సుమారు రూ. 55 కోట్ల నిధులు రావాల్సి ఉందని, అవి కూడా త్వరలోనే విడుదలవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది”

**బిఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి హెచ్చరిక**

**బహుదూర్‌గూడ రైతులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అరెస్ట్**

**నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలింపు..**

**సంఘీభావం తెలిపిన షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు**

**రంగారెడ్డి:** శంషాబాద్ మండలం బహుదూర్‌గూడలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు టెర్మినల్ కోసం భూముల సేకరణ అంశం ఉద్రిక్తతకు దారితీసింది. భూముల సేకరణ కోసం అధికారులు గ్రామానికి చేరుకోగా, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు ఇస్తామని రైతులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, గ్రామస్తులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్



నియోజకవర్గ పరిధిలోని నందిగామ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబల్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కార్తీక్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, పోలీసులు అరెస్టు చేసినంత మాత్రాన తాను వెనక్కి తగ్గేది లేదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. “అరెస్టులతో భయపడేది లేదు. రైతులకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు. రైతుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం” అని కార్తీక్ రెడ్డి అన్నారు.బహుదూర్ గూడ రైతులకు న్యాయమైన పరిహారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

# తండ్రికి అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చిన కూతురు

**హైదరాబాద్, జూలై 18:**తెలంగాణకు చెందిన ఓ యువతి తన తండ్రి 50వ పుట్టినరోజున ఆయనకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది. తన కలల బండిని కళ్ల ముందు చూసిన ఆ తండ్రి ఆనందంతో ఉప్పొంగిపోయారు. భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ హృద్యమైన దృశ్యాలను ఆ కూతురు వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్‌గా మారి లక్షలాది మంది హృదయాలను కదిలిస్తోంది.వివరాల్లోకి వెళితే.. నందిని కావేరి అనే యువతి తన తండ్రి పుట్టినరోజు కోసం కొన్ని వారాలుగా ఒక సర్‌ప్రైజ్ ప్లాన్ చేసింది. ఇన్నాళ్లూ తన కుటుంబం కోసమే బతికిన నాన్నకు గుర్తుండిపోయే బహుమతి ఇవ్వాలని ఆమె నిర్ణయించుకుంది. పుట్టినరోజునాడు, మొదట వీడియో కాల్‌లో నవ్వుతూ ‘హ్యాపీ బర్త్‌డే డాడీ’ అని శుభాకాంక్షలు చెప్పింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఆమె తండ్రిని ఇంటి బయటకు తీసుకువచ్చారు. అక్కడ ఒక పెద్ద వస్త్రంతో కప్పి ఉంచిన వస్తువును చూపించారు.ఏముందా అని ఆసక్తిగా ఆ గుడ్డను తొలగించిన తండ్రికి అక్కడ కొత్త మోటార్‌సైకిల్ కనిపించింది. దాన్ని చూసి ఆనందంతో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. తీవ్రమైన భావోద్వేగంతో అక్కడున్న భార్య, పిల్లలను ఒక్కొక్కరిగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన్ను చూసి కుటుంబ సభ్యులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ మధుర క్షణాలు అందరినీ కదిలించాయి.ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ నందిని ఒక ఎమోషనల్ పోస్ట్ రాసింది. “మా నాన్న తన జీవితాంతం మా కుటుంబానికే ప్రాధాన్యతనిచ్చారు. మాకు అన్నీ ఇచ్చారు కానీ తన కోసం ఏనాడూ ఏమీ అడగలేదు. అందుకే నేను ప్రతీ రోజూ కష్టపడి పని చేస్తున్నాను. ఆయన త్యాగాలకు, ప్రేమకు, నాపై ఉంచిన నమ్మకానికి ఇది ఒక చిన్న కృతజ్ఞత మాత్రమే” అని ఆమె పేర్కొంది. ఈ బహుమతి తన తండ్రి చేసిన త్యాగాలతో పోలిస్తే చాలా చిన్నదని, కానీ ఆయన మాకు ఎంత ఇష్టమో గుర్తుచేస్తుందని ఆశిస్తున్నానని తెలిపింది. ఈ సర్‌ప్రైజ్‌ను రహస్యంగా ఉంచడంలో సహాయం చేసిన తన తల్లికి, సోదరుడికి కూడా ఆమె ధన్యవాదాలు చెప్పింది.ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. తండ్రి కళ్లలోని కన్నీళ్లు ఆయన చేసిన ఏళ్ల త్యాగాలను, కృతజ్ఞతను ప్రతిబింబిస్తున్నాయని పలువురు కామెంట్ చేశారు. తమ తల్లిదండ్రులకు కూడా ఇలాంటి బహుమతి ఇచ్చే స్థాయికి తాము ఎదగాలని చాలామంది ఆకాంక్షించారు. తల్లిదండ్రుల నిస్వార్థ త్యాగాలకు దక్కే గుర్తింపు ఎంత విలువైనదో ఈ వీడియో గుర్తు చేస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## ‘ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క’..

- మొదటి పేజీ తరువాయి

చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు” అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన ‘మహాద్రోహాన్ని’ యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ఒక మంత్రి ఒక మాట, మరో మంత్రి మరో మాట చెబుతూ ఉద్యోగాల విషయంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక లూటీ జరుగుతోందని, ప్రజలు హామీల గురించి ప్రశ్నిస్తే వారిని అవమానిస్తున్నారని విమర్శించారు.

## కమలానికి ట్రబుల్ షూటర్ కావలెను...

- మొదటి పేజీ తరువాయి

తిప్పుకుని, అధికార పీఠం వైపు నడిపించగల అగ్రనేత ఎవరనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.ప్రస్తుతానికి రాష్ట్రంలో ఉన్న కిషన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సౌమ్యులుగా ముద్రపడ్డారు. క్లిష్టమైన రాజకీయ పోరాటాల్లో ఇలాంటి సౌమ్యత పార్టీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేకపోతోంది. మరోవైపు బండి సంజయ్ మాటలు, లక్ష్మణ్ లాంటి నేతల ఉపన్యాసాలు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లను పూర్తి స్థాయిలో సమ్మోహన పరచలేకపోతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే స్థానిక నేతలు బలంగా ఉన్నారు. దాదాపు 30 స్థానాల్లో మినహా, మిగిలిన చోట్ల కేవలం నరేంద్ర మోదీ ముఖాన్ని చూసి లేదా పార్టీ సిద్ధాంతాన్ని చూసి ఓట్లేయాల్సిన పరిస్థితి ఉంది.పట్టణ ప్రాంతాల్లో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకత్వ బలం, ప్రజల్లో నిరంతరం ఉండే మాస్ లీడర్ చరిష్మా మాత్రమే ఓట్లను రాల్చగలవు. ఈ బలహీనతను పసిగట్టే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాంటి ప్రత్యర్థి నేతలు ఢిల్లీ వేదికగా సైతం “తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు” అని ధీమాగా సవాల్ విసరగలుగుతున్నారు. ఓటు బ్యాంకు ఉన్నా, దానికి సరైన దిశా నిర్దేశం చేసే నాయకత్వం లేకపోతే ఎన్నికల రేసులో వెనుకబడక తప్పదనే విషయం కమలనాథులకు అర్థమవుతోంది.ఈ నేపథ్యంలోనే బీజేపీ జాతీయ అధిష్టానం ఇప్పుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలు, మోదీ ఇమేజ్‌పైనే ఆధారపడకుండా... తెలంగాణ మట్టి వాసన తెలిసిన, దూకుడుగా ఉంటూ ప్రజలను ఉర్రూతలూగించగల ఒక సమర్థవంతమైన ‘మాస్ లీడర్’ కోసం అధిష్టానం వేట మొదలుపెట్టింది. లీడర్షిప్ లోపాన్ని సవరించుకుంటేనేవచ్చే ఎన్నికల్లో అధికారం సాధించడం సాధ్యమవుతుందని అటు పార్టీ శ్రేణులు, ఇటు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నాయకత్వ లోటును బీజేపీ ఎంత త్వరగా భర్తీ చేస్తుందనే దానిపైనే ఆ పార్టీ తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## చరిత్ర సృష్టించిన విక్రమ్-1..

- మొదటి పేజీ తరువాయి

నిరూపించారు’ అని ప్రధాని కొనియాడారు. ‘విక్రమ్-1’లో తన ‘వందేమాతరం’ సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. ‘ఈ ప్రయోగం ద్వారా ‘వందేమాతరం’ సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది’ అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు ‘మిషన్ ఆగమన్’ పేరిట చేపట్టిన ‘విక్రమ్-1’ రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ తొలి కక్ష్య ప్రయోగంలో గ్రహ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థల సాంకేతిక పేలోడ్‌లు సహా స్కైరూట్ రూపొందించిన స్కోప్ ప్లాట్‌ఫామ్‌నూ పరీక్షించారు. అలాగే ‘కాస్మిక్ బ్లూమ్’ పేరిట ల్యాబ్‌లో తయారైన వజ్రం, భారత శాస్త్రవేత్తలకు అంకితమైన సూక్ష్మ కళాఖండం, రాకెట్ నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల సంతకాలతో కూడిన ప్రత్యేక పేలోడ్‌లనూ కక్ష్యలోకి పంపారు

## తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం..

- మొదటి పేజీ తరువాయి

టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో ‘క్యూర్’ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

వార్తాతరంగాలు
ఆదివారం 19 జూలై 2026

# వరి ఉరి అవుతుందా...

**నల్గొండ, జూలై 18:**వరి పంట పెరగడాన్ని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. నిజంగా వరి విస్తీర్ణం బాగా పెరిగింది. కానీ దాని వల్ల రైతుకు.. లేదా మార్కెట్కు ఏమైనా లాభం కలుగుతుందా అంటే.. ఆలోచించాల్సిన అవసరం. వరి పంట మాత్రమే గొప్పదన్నట్లుగా ప్రచారం చేసి..దానికి తగ్గట్లుగా ఇచ్చిన ప్రోత్సాహం వల్ల రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ధాన్యం అమ్ముకోలేని పరిస్థితికి చేరుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో వరి పంట విస్తీర్ణం, దిగుబడి గత పన్నెండేళ్లలో అనూహ్యంగా, ఊహించని రీతిలో పెరిగిందనేది అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్న పరమ సత్యం. తెలంగాణ నేడు దేశంలోనే ధాన్య భాండాగారంగా అవతరించింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 2013–14 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం కేవలం 20 లక్షల హెక్టార్లు అంటే సుమారు 49 లక్షల ఎకరాలు కాగా, ఉత్పాదకత కేవలం 65.5 లక్షల టన్నులుగా రికార్డయ్యింది.అయితే, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి సర్కారు ప్రోత్సాహకాలతో పన్నెండేళ్ల తిరిగేసరికి 2025–26 నాటికి వరి సాగు ఏకంగా 129.80 లక్షల ఎకరాలకు చేరింది. ప్రస్తుత సీజన్‌లో సుమారు 282 లక్షల టన్నుల రికార్డు వరి ఉత్పత్తితో, దేశంలోనే యాసంగి వరి సాగులో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.కానీ, అంకెల్లో కనిపిస్తున్న ఈ రికార్డుల వైభవం క్షేత్రస్థాయిలో ఉన్న రైతులకు నిజంగానే మేలు చేస్తోందా? అంటే 'లేదు' అనే సమాధానమే వస్తోంది. దేశంలోనే అత్యధిక పంట పండించామంటూ పాలకులు ఢంకా బజాయించుకోవడానికి, రాజకీయంగా గొప్పలు చెప్పుకోవడానికి ఈ వరి బూమ్ బాగానే ఉపయోగపడుతోంది కానీ.. మిగులు దిగుబడితో మార్కెట్ కుప్పకూలి రైతులకు నికర లాభాలు దక్కకుండా పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం,



ఆహార మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా వరి సాగును తగ్గించాలని, నీటి లభ్యత తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని పదే పదే సూచిస్తోంది.అయినప్పటికీ, మన పాలకులు కేవలం "వరి వేయడమే ఒక అద్భుత ప్రగతి" అన్నట్లుగా ప్రచారం కల్పించడంతో.. మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా రైతులంతా ఒకే రకమైన వరి సాగు వైపు గుడ్డిగా అడుగులు వేశారు.ఈ విషయంలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కొంత ముందుచూపుతో వ్యవహరిస్తోందనే చెప్పాలి. ఏపీలో ఉద్దేశపూర్వకంగానే సాంప్రదాయ వరి పంట విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించి, అంతర్జాతీయంగా మంచి గిట్టుబాటు ధరలు లభించే వాణిజ్య పంటలు, ఉద్యానవన తోటలు , ఆయిల్ పామ్ వైపు రైతులను విజయవంతంగా మళ్లిస్తున్నారు. దేశంలోనే రబీ వరి సాగులో తెలంగాణ 59.90 లక్షల ఎకరాల్లో పంట వేస్తే, ఏపీ కేవలం 17.29 లక్షల ఎకరాలకే పరిమితం చేసింది. ఇలా క్రాప్ డైవర్సిఫికేషన్ చేయడం వల్ల ఏపీ రైతులకు డిమాండ్ ఆధారిత గిట్టుబాటు ధర దక్కుతోంది.

కానీ తెలంగాణలో మాత్రం మిగులు ధాన్యాన్ని ఏం చేసుకోవాలో తెలియక, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ప్రతి ఏటా వేల కోట్ల రూపాయల అప్పులు చేసి సేకరించాల్సి వస్తోంది.వాస్తవానికి, వరి పంట ఎప్పుడూ ఒకే రకమైన ఏకపంట విధానానికి దారితీస్తుంది. ఇది భూగర్భ జలాలను, ఉచిత విద్యుత్‌ను విపరీతంగా అడుగంటించడంతో పాటు దీర్ఘకాలంలో భూసారాన్ని కూడా దెబ్బతీస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఎంత శ్రమించినా అంతిమంగా లభించే కనీస మద్దతు ధర పెట్టుబడి ఖర్చులకు మాత్రమే సరిపోతోంది.మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, సిరిధాన్యాలు , హై-వాల్యూ ఉద్యానవన పంటల వైపు మన రైతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. తృణధాన్యాలు, కమర్షియల్ పంటలకు సరైన మార్కెటింగ్ నెట్‌వర్క్, కోల్డ్ స్టోరేజీలు కల్పించకపోవడం వల్లే నేటికీ సామాన్య రైతు 'వరి' అనే సురక్షితమైన కానీ తక్కువ లాభదాయకమైన వలయంలోనే చిక్కుకుపోవాల్సి వస్తోంది.ఈ సంక్షోభం నుంచి తెలంగాణ వ్యవసాయ రంగం బయటపడాలంటే.. ఇకనైనా కేవలం రికార్డుల కోసం వరి సాగును పెంచడం ఆపి, మార్కెట్ సెంట్రిక్ పంటల వైపు మళ్లక తప్పదు. ఏ పంట వేస్తే రైతు జేబు నిండుతుందో, ఏ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రేజ్ ఉందో గుర్తించి, వాటికి కూడా పూర్తి స్థాయిలో కొనుగోలు గ్యారెంటీని, రాయితీలను ఇస్తూ పటిష్టమైన పాలసీని తేవాలి. లేనిపక్షంలో, రాష్ట్ర ఖజానాపై 'వరి సేకరణ' భారం పెరిగిపోవడంతో పాటు, దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్నా.. అప్పుల ఊబిలోనే మగ్గిపోయే దుస్థితి తెలంగాణ అన్నదాతకు తప్పదని వ్యవసాయ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బీఆర్ఎస్ నేత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ హౌస్ అరెస్టు



**హైదరాబాద్:**బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ ను పోలీసులు గారిని హౌస్ అరెస్ట్ చేసారు. మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్ స్టేడియంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొనడానికి నేను సిద్ధమవుతుండగా, సైబరాబాద్ పోలీసులు ఈరోజు ఉదయమే నా ఇంటికి చేరుకుని నన్ను హౌస్ అరెస్ట్ చేశారని అయన ఆరోపించారు.ఈ ఘటన పట్ల నేను తీవ్ర ఆశ్చర్యం మరియు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. రవ తెలంగాణ హైకోర్టు మరియు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి గారి నుండి బహిరంగ సభ నిర్వహణకు రాతపూర్వక అనుమతులు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు నన్ను, ఇతర నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడం రాజ్యాంగ విరుద్ధం. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు మరియు ఆర్టికల్ 19 (క్లాజ్ 1, ఏ మరియు బి) ప్రకారం లభించిన స్వేచ్ఛగా సంచరించే, మాట్లాడే ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని మండిపడ్డారు. ఒకవైపు 'సంవిధాన్ బచావో' అని నినదిస్తూ, మరోవైపు అదే రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. విషయంలో పోలీసు అధికారులకు స్పష్టమైన సమాచారం లేదని వారు చెబుతున్నారు. మా ఎమ్మెల్యే శంభీపూర్ రాజు ఇప్పటికే అనుమతి పత్రాలను అందజేసినా, పై అధికారుల ఆదేశాల పేరుతో వారు మమ్మల్ని అడ్డుకుంటున్నారు. నాకు గనుక ఆ బహిరంగ సభకు హాజరయ్యే అనుమతి లభించకపోతే, నేను ఖచ్చితంగా నా నివాసంలోనే ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభిస్తానని హెచ్చరిస్తున్నాను. రాజ్యాంగబద్ధమైన హక్కుల రక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నేను డిజిపి (ఐ.పి) ని మరియు హోమ్ మంత్రిని కోరుతున్నానని అన్నారు.

## తెలంగాణలో పర్మనెంట్ రెసిడెంట్ సర్టిఫికెట్





**హైదరాబాద్ జూలై 18:**తెలంగాణలో కర్ణాటక రాష్ట్రం తరహాలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం విధానాన్ని ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ వెల్లడించారు. ఈ కొత్త విధానం సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించడానికి ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దీర్ఘకాలంగా నివసిస్తున్న ప్రజలు తమ శాశ్వత నివాసాన్ని సులభంగా నిరూపించుకోవడానికి వీలుగా ఒక ప్రామాణిక ప్రభుత్వ పత్రాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి షబ్బీర్ అలీ వినతిపత్రం సమర్పించారు.షబ్బీర్ అలీ అందించిన ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రాథమికంగా చర్చించారు. కర్ణాటకలో అమలులో ఉన్న పి.ఆర్.సి విధానాన్ని, దాని ఫ్రేమ్‌వర్క్‌ను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అలాంటి వ్యవస్థను తీసుకురావడానికి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. ఓటర్ల వెరిఫికేషన్ సమయంలో పరిశీలించదగిన పత్రాల జాబితాలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం కూడా ఒకటని షబ్బీర్ అలీ గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తి పరిశీలన తర్వాత అధికారికంగా జారీ చేసే పి.ఆర్.సి, ఓటర్లు తమ అర్హతను నిరూపించుకోవడానికి ఒక బలమైన మద్దతు పత్రంగా ఉపయోగపడుతుందని వివరించారు.ఈ కొత్త నివాస ధ్రువీకరణ పత్రం వస్తే చాలా ప్రయోజనకరంగా ఉండనుంది. 2002 నాటికి ఓటు హక్కు వయసు లేని వారికి ఇది నివాస ఆధారంగా మారుతుంది. వివాహం తర్వాత పేర్లు, చిరునామాలు మారిన మహిళలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒక నియోజకవర్గం లేదా జిల్లా నుండి మరొక ప్రాంతానికి మారిన కుటుంబాలకు నివాస ధ్రువీకరణ సులువవుతుంది. పాత రికార్డులలో పేర్ల స్పెల్లింగులు లేదా అనువాద లోపాల వల్ల తమ వివరాలను కనుగొనలేకపోతున్న నివాసితులకు ఈ పత్రం ద్వారా మేలు జరుగుతుంది.

## ఆంధ్రప్రదేశ్ లో 'కరోనా'

### గత రెండు వారాల్లో కరోనా లక్షణాలతో నలుగురు మృతి





కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది కూటమి సర్కార్. విజయవాడ జీజీహెచ్ లో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేసింది ప్రభుత్వం.15 బెడ్లతో ఐసోలేషన్ ఏర్పాటు చేశారు అధికారులు.కోవిడ్ కిట్లు, ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచామని 10 మంది వైద్యుల బృందం, సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు అధికారులు. కోవిడ్ లక్షణాలు ఉంటే తప్పనిసరిగా టెస్ట్ చేయించుకోవాలని సూచిస్తున్నారు అధికారులు. జీజీహెచ్ నుంచి ఇప్పటివరకూ 46 శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించామని 46 మందిలో ఎవరికీ కోవిడ్ పాజిటివ్ రాలేదని స్పష్టం చేశారు అధికారులు.ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కోవిడ్ మెడిసిన్ అందుబాటులో ఉంచామని..జ్వరం,జలుబు, దగ్గు, గొంతునొప్పి లక్షణాలతో ఎవరొచ్చినా రెగ్యులర్ ఓపీ కాకుండా కోవిడ్ వార్డుకు తరలిస్తున్నామని తెలిపారు అధికారులు. ఇక్కడే ప్రత్యేకంగా కోవిడ్ కోసం ఓపీ ఏర్పాటు చేశామని..ఏ సమయంలోనైనా ఓపీ సేవలు అందించేలా కోవిడ్ వార్డులో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు అధికారులు.

## ఎండ్రిన్ మీరు తాగాలి...

### బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో వెల్లువెత్తిన నిరసన

**హైదరాబాద్, జూలై 18:**హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సభలో ఓ నిరుద్యోగ యువతి కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ఆస్మా అనే యువతి నిలదీశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను మోసం చేశారని ఆమె మండిపడ్డారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'లో ఆస్మా మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి పెద్ద తప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గతంలో నిరుద్యోగులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి చేసిన 'ఎండ్రిన్ తాగాలి' అనే వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఆమె తీవ్రంగా స్పందించారు. "ఎండ్రిన్ తాగాల్సింది మేము కాదు.. నువ్వే. ఊరూరూ తిరిగి నిన్ను గెలిపించిన పాపానికి ముందు నువ్వు, తర్వాత రాహుల్ గాంధీ, ఆ తర్వాత ప్రియాంక గాంధీ తాగాలి" అంటూ సీఎంను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎల్ నినో ఎఫెక్ట్... పెరిగిన కరెంట్ బిల్లు....

### గృహజ్యోతినుంచి 4 లక్షల మంది ఔట్

**హైదరాబాద్, జూలై 18:**తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో చాలా మంది జీరో కరెంటు బిల్లు వస్తోంది. అయితే వేసవిలో కొందరు కూలర్లు, ఏసీలు వాడడంతో 200 యూనిట్లు దాటి బిల్లు చెల్లిస్తున్నారు. వర్షాకాలం రాగానే మళ్లీ జీరో బిల్లుతో లబ్ధి పొందుతున్నారు. అయితే ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారు. తాజాగా దీని ప్రభావం గృహజ్యోతి లబ్ధిదారులపైనా పడింది. వాతావరణ వ్యత్యాసాలతో గృహజ్యోతి లబ్ధిదారులు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కూడా అసాధారణ ఎండలు, ఉక్కపోత కారణంగా గృహ విద్యుత్ వినియోగం పెరగడంతో అనేక మంది లబ్ధిదారుల అర్హత కోల్పోతున్నారు.ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్)పరిధిలోని సుమారు నాలుగు లక్షల మంది లబ్ధిదారులు పథకంతో లబ్ధి పొందలేకపోయారు. మొత్తం 26.54 లక్షల మంది నమోదైన





వారిలో కేవలం 22.59 లక్షల మందికి మాత్రమే జీరో బిల్లు వచ్చింది. ఇతర విద్యుత్ సర్కిళ్లలో కూడా అనర్హుల సంఖ్య భారీగా ఉందని సమాచారం.సాధారణంగా వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి, విద్యుత్ వినియోగం తగ్గుతుందని అంచనా. కానీ ఎల్‌నినో ప్రభావంతో ఈ సమతుల్యత దెబ్బతింటోంది. అధిక ఎండలు, ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఏసీలు ఎక్కువగా వాడటం వల్ల చాలా గృహాల్లో విద్యుత్ వినియోగం 200 యూనిట్ల పరిమితిని అధిగమించింది. ఇది పథకం

రూపొందించిన సమయంలో ఊహించని వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడిన సవాలు.పథకం నుంచి బయటకు వచ్చిన వారికి నెలవారీ విద్యుత్ బిల్లులు వస్తాయి. తక్కువ ఆదాయ కుటుంబాలకు ఇది అదనపు ఆర్థిక భారం. జూన్ నెలలోనే లక్షలాది మంది ఈ షాక్‌ను ఎదుర్కొన్నారు. జూలై నెలలో కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనాలు. దీంతో పథకం యొక్క ప్రయోజనం తగ్గిపోతూ, లబ్ధిదారుల విశ్వాసం కూడా ప్రభావితం అవుతుంది.ఈ పరిణామం కేవలం ఒక పథకానికి మాత్రమే పరిమితం కాదు. వాతావరణ మార్పులు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో గృహాల్లో విద్యుత్ సామర్థ్యం గల ఉపకరణాల వాడకం, అనవసర వినియోగం తగ్గించడం వంటి అలవాట్లు ప్రోత్సహించాలి. ఇళ్లలో ఇన్సులేషన్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లు వంటి చర్యలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులను బట్టి పరిమితులను సర్దుబాటు చేయడం లేదా అదనపు మద్దతు ఇవ్వడం గురించి ఆలోచించాలి.మొత్తంమీద, ఎల్‌నినో సంక్షేమ పథకాలను ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు, ప్రజలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవడం ద్వారా మాత్రమే లబ్ధిదారులకు ఉపశమనం కలుగుతుంది.

# సేనలో చేరికలు ఎప్పుడు





**హైదరాబాద్, జూలై 18:**తెలంగాణ రక్షణ సేన కవిత పార్టీ పెట్టి నాలుగు నెలలు కావస్తుంది. అయితే ఇప్పటి వరకూ ఎవరూ ఆ పార్టీలో చేరలేదు. ఒకరు ఇద్దరు మినహా కవిత పార్టీలోకి వచ్చేందుకు పెద్దగా ఉత్సాహం చూపడం లేదు. కేసీఆర్ తనయగా కవిత కొత్త పార్టీలో బీఆర్ఎస్ నుంచి పెద్దయెత్తున వలసలు ఉంటాయని భావించారు. కవిత కూడా ఇదే అంచనా వేశారు. కవిత కూడా ఇదే విషయాన్ని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అనేక మంది తనతో టచ్ లో ఉన్నారని చెప్పడంతో ఎవరెవరు చేరతారన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రకటించారు. ఈ సభలోనే తన ఆశయాలను ప్రకటించారు. అయితే నాలుగు నెలలవుతున్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎవరూ చేరకపోవడంతో ఒకింత ఆమె సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న వారే ఎక్కువ మంది కవిత పార్టీలో ఉన్నారు. గతంలో తెలంగాణ జాగృతి సంస్థలో కీలకంగా ఉన్న వారు మాత్రమే తెలంగాణ రక్షణ సేనలోనూ కీలక భూమిక పోషిస్తున్నారు. చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ పార్టీలో చేరలేదు. అయితే కవిత అనుచరులు మాత్రం ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి వేచి చూసి వస్తారని చెబుతున్నారు. మొన్నటి వరకూ కవిత పార్టీలో చేరడానికి కొందరు ఉత్సాహం చూపారు. అందుకు సిద్ధమయ్యారని కూడా తెలిసింది. తమ అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకుని కవిత పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.. కానీ కవిత ఎప్పుడైతే ఇక తాను బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదని తెగేసి చెప్పారో.. అప్పుడు వెనక్కు తగ్గినట్లు సోషల్ మీడియాలో ఎక్కువ కామెంట్స్ వినిపిస్తున్నాయి. కవిత బీఆర్ఎస్ లో చేరితే ఆమె పార్టీ కూడా అందులో విలీనమయితే తమకు ఉపయోగముంటుందని కొందరు అంచనా వేసి వెళ్దామనుకున్నారు. తాను వెళ్లనని చెప్పడంతో ఇక అక్కడకు వెళ్లి రాజకీయంగా నష్టపోవడమేమోనన్న ఆందోళనతో వెనక్కు తగ్గుతున్నారు. మరొకవైపు కవిత త్వరలోనే పాదయాత్ర చేయడానికి సిద్ధమవుతున్నారు. కవిత పార్టీకి కొంత హైప్ వస్తే అప్పుడు చేరికలు వస్తాయని, ఇక ఎన్నికల సమయంలో టిక్కెట్లు రాని వారు బీఫారాలు తీసుకోవడానికి తెలంగాణ రక్షణ సేన వద్దకు వస్తారన్న అంచనాలు కూడా ఉన్నాయి. మొత్తం మీద నాలుగు నెలల నుంచి కవిత పార్టీలో చేరికలు లేకపోవడం రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

## యువతి యువకుడు ఆత్మహత్య

**నల్గొండ:**నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్లలో అనుమానాస్పద రీతిలో యువతి మృతి చెందింది. మృతురాలు లక్ష్మీ ప్రసన్న ఉరికి వేలాడుతూ కనిపించింది. ప్రసన్న మృతిపై గ్రామానికి చెందిన ఓ యువకుడిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తోన్నారు. ప్రసన్న కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసిన యువకుడు కూడా శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చరత్ తాటి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరూ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నట్లు సమాచారం. ప్రసన్నసూర్యాపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఇద్దరి మృతి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లమ్మ కళ్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు...

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్:**ఈ నెల 21 వ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, 22 వ తేదీన రథోత్సవం జరగనున్న నేపధ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడించారు. ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆలయం వద్ద అయన సమీక్ష నిర్వహించారు. లక్షలాది గా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు, ప్రశాంత వాతావరణంలో అమ్మవారి కళ్యాణం జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు, ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక అదనపు సిబ్బంది నియామకం, అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తోపులాట కు గురికాకుండా భారికేడ్ ల ఏర్పాటు చేసామని అన్నారు.2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బల్కంపేట ఆలయం ఎంతో అభివృద్ధి చేశాం. నాడు అమ్మవారి కళ్యాణానికి 20 వేల మంది వచ్చే ఇప్పుడు 7 నుండి 8 లక్షల మంది వరకు భక్తులు వస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య వారానికి లక్ష దాటుతుందని అయన అన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కొని పంటలను కాపాడుకోవాలి

**జోగులాంబ గద్వాల, జూలై 19(స్కై న్యూస్):**జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి,వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని డాక్టర్ పి. అర్చన,శాస్త్రవేత్త ఉ కోఆర్డినేటర్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాల రాక ఆలస్యం కావడం,వర్షాలు తగ్గిపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,07,082 ఎకరాల్లో పత్తి, 24,840 ఎకరాల్లో సీడ్ పత్తి, 965 ఎకరాల్లో వరి నారుమడులు, 9,066 ఎకరాల్లో కంది, 1,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉన్నాయని తెలిపారు.సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాలు ఆలస్యమైతే జూలై 16--31 మధ్య పత్తి,కంది,పెసర,మినుములు, అలసందలు,ఉలవలు,సజ్జలు,రాగులు, పొద్దుతిరుగుడు,ఆముదం, మొక్కజొన్న, తక్కువ కాలంలో పండే కూరగాయలను సాగు చేయాలని,ఆగస్టు 1--15 మధ్య కంది,అలసందలు,ఉలవలు, ఆముదం,పొద్దుతిరుగుడు, కూరగాయలు,ఆగస్టు 16--31 మధ్య నువ్వులు సాగు చేయాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన తరువాత మాత్రమే విత్తనాలు వేయాలని,నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే ఎరువులు వేయాలని తెలిపారు.అవసరమైన చోట ప్రాణాధార నీటిపారుదల, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించి నీటిని పొదుపుగా ఉపయోగించాలని రైతులకు సూచించారు. దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ (ఖచీూ3) ద్రావణాన్ని 2--3 సార్లు ఆకులపై పిచికారీ చేయాలన్నారు.వరి సాగులో నీటి పొదుపుకు ప్రత్యామ్నాయ తడపడం--ఆరబెట్టడం విధానాన్ని అనుసరించాలని, నారుమడులను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని,మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్, పత్తిలో త్రిప్స్, తెల్లదోమ వంటి చీడపీడలను నిరంతరం పర్యవేక్షించి సకాలంలో నియంత్రించాలన్నారు. పంటల ఎంపికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతి మంగళవారం,శుక్రవారం విడుదల చేసే వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పంటలలో కలుపు నివారణ,నేల తేమ సంరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర చీడపీడల నియంత్రణ, అంతర పంటల సాగు వంటి చర్యలు చేపట్టడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.రైతులు భారత వాతావరణ శాఖ మరియు వ్యవసాయ శాఖ విడుదల చేసే వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ,వాటికి అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా,ముందస్తు ప్రణాళిక, సరైన పంటల ఎంపిక,నీటి పొదుపు, తేమ సంరక్షణ,శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల అమలు ద్వారా దిగుబడి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు,శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించాలని ఆమె కోరారు.

## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం...

**పో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా పుట్టపాగ వెంకటస్వామి**



**నాగర్ కర్నూల్ జులై 18( స్కై న్యూస్)** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా సంఘాలకు అతీతంగా జర్నలిస్టులు అందరినీ కలుపుకొని వర్కింగ్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీని ముందుకు తీసుకు వెళ్తామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పుట్టపాగ వెంకటస్వామి అన్నారు శనివారం సొసైటీ ఎన్నికల అధికారి నారాయణరెడ్డి సందీప్ ల ఆధ్వర్యంలో సింగిల్ విండో సమావేశ మందిరంలో నూతన అధ్యక్షుడితో పాటు 11 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ గత సొసైటీ ఆధ్వర్యంలో 80 శాతం పనులు ముందుకు తీసుకు వెళ్లడం జరిగిందని మిగతా పనులను నూతన కమిటీ జర్నలిస్టుల సహకారంతో పూర్తి చేస్తామని అన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తామని అన్నారు అనంతరం కమిటీలో అధ్యక్షుడిగా పుట్టపాగ వెంకటస్వామి ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర రావు ప్రధాన కార్యదర్శిగా కందికొండ మోహన్ కోశాధికారిగా సురేష్ రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సభ్యులుగా కేవీఎస్ సురేష్ ప్రదీప్ రాజేష్ కుమార్ గౌడ్ సత్యనారాయణ ధర్వేశ్ మాధవరెడ్డి తిప్పర్తి విజయ్ లను ఎన్నుకున్నారు అనంతరం వారిని తాజా మాజీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్ సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ తమ హయాంలో సొసైటీ సేవలను జర్నలిస్టులకు అందించడంతోపాటు ప్రధానంగా సొసైటీకి స్థలాన్ని సాధించడం జరిగిందని అన్నారు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా 15 సంవత్సరాలు సేవ అందించడం జరిగిందన్నారు అనంతరం తాజా మాజీలైన అవమాదుల్లా ఖాన్ దినకర్రావు జెమినీ సురేష్ సురేష్ రావులను సన్మానించారు

## శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై పెద్దపులి ప్రత్యక్షం: వాహనదారుల్లో ఉత్కంఠ!

**మన్ననూర్:** శ్రీశైలం--హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు శుక్రవారం ఒక అరుదైన, ఉత్కంఠభరితమైన దృశ్యాన్ని చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూర్ సమీపంలో ఒక పెద్దపులి ఒక్కసారిగా అడవిలో నుంచి రోడ్డుపైకి వచ్చింది. మన్ననూర్ నుండి శ్రీశైలం వైపు, అలాగే హైదరాబాద్ వైపు వెళ్తున్న పలువురు వాహనదారులకు ఈ పులి నెమ్మదిగా నడుచుకుంటూ రోడ్డు దాతుతున్న దృశ్యం కనిపించింది. దాంతో అప్రమత్తమైన వాహనదారులు తమ వాహనాలను సురక్షిత దూరంలోనే నిలిపివేశారు. పులి ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టకుండా, చాలా ప్రశాంతంగా రోడ్డు దాటి అవతలి వైపు ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్ళిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై పులి నడుస్తున్న దృశ్యాలను కొందరు వాహనదారులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా, ఆ ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

**అటవీ శాఖ అధికారుల హెచ్చరికలు:**

ఈ ఘటనపై స్పందించిన అటవీ శాఖ అధికారులు, టైగర్ రిజర్వ్ గుండా వెళ్లే ఈ రహదారిపై వన్యప్రాణుల సంచారం సహజమేనని పేర్కొన్నారు. అయితే వాహనదారులు ప్రయాణించేటప్పుడు క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు: వేగ నియంత్రణ: ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు అతివేగంతో ప్రయాణించకుండా జాగ్రత్త పడాలి. సురక్షిత దూరం: అడవి జంతువులు కనిపించినప్పుడు వాహనాలను సురక్షిత దూరంలోనే నిలిపివేయాలి. రెచ్చగొట్టవద్దు: వన్యప్రాణులను చూసి హారన్లు కొట్టడం, లైట్లు వేయడం లేదా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయకూడదు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ దేశంలోనే ప్రముఖ పులుల ఆవాస ప్రాంతంగా గుర్తింపు పొందిందని, ఇటీవల కాలంలో ఇక్కడ పులుల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో అటవీ శాఖ



నిరంతరం నిఘా కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ తమకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## షాద్‌నగర్ నుంచి యువ సంగ్రామ సదస్సుకు భారీగా బీఆర్ఎస్ శ్రేణుల తరలింపు



**రంగారెడ్డి జిల్లా, జూలై 18: (స్కై న్యూస్):** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నాయకత్వంలో షాద్‌నగర్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. సదస్సుకు బయలుదేరే ముందు షాద్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సరూర్‌నగర్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులు, యువతను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువతకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఓటుతో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా జూలై 18 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూజేవీసీ) నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ అనంతరం తెలంగాణ తల్లి, షోయబుల్లా ఖాన్ విగ్రహాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

## ప్రభుత్వ పాఠశాల చదువుకున్న విద్యార్థిలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారు...

ప్రతి ఒక విద్యార్థి ఉన్నతమైన లక్ష్యంతో చదవాలి....

పీయం శ్రీ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 48 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, సైన్స్ లాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

10 లక్షల తో టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జూలై 19(స్కై న్యూస్):** జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీ నందు పి ఎం సి ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో 48 లక్షల వ్యయంతో నిర్మాణమైన అదనపు తరగతి గదిలో సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు...ఎమ్మెల్యే కి వార్డు కౌన్సిలర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.అదనపు తరగతి గదులను సైన్స్ ల్యాబ్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.పాఠశాల అభివృద్ధి లో భాగంగా వాటర్ ఫిల్టర్ , డిజిటల్ క్లాస్ ప్రముఖ వ్యాపారవేత్త సీనియర్ నాయకుడు బండ్ల రాజశేఖర్ రెడ్డి దాత సహకారంతో అందజేస్తారని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను కూడా ఈ పాఠశాల చదువుకున్న ఇప్పుడు ఈ పాఠశాలకు వచ్చిన నాటి రోజుల గుర్తుకొస్తాయి.గ్రామీణ ప్రాంతం నుండి పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం చదువుకోవడం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు చదివితే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల దీటుగా ఉపాధ్యాయులు అందించడం జరుగుతుంది.ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక విద్యార్థులు గల రాష్ట్రంలోని నాలుగు పాఠశాలలు గద్వాలలో ఉన్నాయి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ బాలుర ఉన్నంత పాఠశాల ప్రభుత్వ అభ్యున్నత పాఠశాల ధరూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకోవడం జరుగుతుంది ఇక్కడ చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విష విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలపారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది వివిధ రంగాల ప్రభుత్వ ఉద్యోగాలలో అత్యున్నత స్థానాలలో ఉన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ చదువుకొని నేడు ఎమ్మెల్యేగా ఉన్నాను. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాల చదివించాలి ప్రభుత్వ పాఠశాలలు మంచి విద్యను



అందజేయడం జరుగుతుంది. అని పేర్కొన్నారు. మీరు కూడా మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదిగి మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు మీ గ్రామానికి గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు ప్రతిష్టలుతీసుకురావాలని కోరారు పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, సత్యారెడ్డి రమేష్ నాయుడు, కృష్ణయ్య సార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్, వేదవతి వెంకటేశ్వర రెడ్డి, రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, గోవిందు, జిల్లా డీసీసీ మెడికల్ హెల్త్ అధ్యక్షులు నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ మురళి, నరహరి గౌడు,ఇసాక్, నాయకులు గోవిందు, వంట భాస్కర్ సుదర్శన్, ప్రవీణ్, లక్ష్మన్న, రిజ్వాన్, మోసిన్, ఇలియాజ్, మైలగడ్డ చంద్రశేఖర్ రంగారెడ్డి, నాగ శంకర్, శంకర్, గంట రమేష్, గీత రెడ్డి, నరసింహులు యాదవ్, నాగార్జున నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభూ శ్రీ కృష్ణ స్వామిని దర్శించుకున్న ఎమ్మార్వో

**జోగులాంబ గద్వాల జిల్లా జూలై 18 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలోనేడు శ్రీ స్వయం శ్రీ కృష్ణ స్వామిని ఎమ్మార్వో ఝాన్సీ రాణి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,పళ్ళు, పూలు,సమర్పించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.అలాగే



శ్రీకృష్ణ స్వామి అర్చకులు పాండు స్వామి ఎమ్మార్వో ఝాన్సీ రాణికి మరియు ఆర్ఐ మహేందర్లకు పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించి..స్వాగతం పలికారు. మరియు స్వామి వారి చెత్త గోపురం అక్షంతలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్ కృష్ణయ్య, వెంకటేష్, సర్వేయర్ బీచుపల్లి, జిపిఓ శీను, తదితరులు ఉన్నారు.

## క్రైస్తవ మైనారిటీలకు స్వయం ఉపాధి పథకాల దరఖాస్తుల గడువు జూలై 31 వరకు పొడిగింపు



**జోగులాంబ గద్వాల, జూలై 19(స్కై న్యూస్):**తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న క్రైస్తవ మైనారిటీ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకాల కింద కుట్టు మిషన్లు, చిరు వ్యాపారాల ఏర్పాటు, ఈ-బైక్‌లు,ఈ-స్కూటీలు, మోటార్ బైక్‌లు పొందేందుకు అర్హులైన క్రైస్తవ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.పథకాల అర్హతలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం,రూమ్ నెం. ఎఫ్-8, ఐడీఓసీ కాంప్లెక్స్, జోగుళాంబ గద్వాల జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా సూచించారు.

## బిజెపి కార్యకర్తల సమావేశం



**జోగులాంబ గద్వాల, జూలై 18(స్కై న్యూస్);** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండల బిజెపి అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో డికె. బంగ్లా లో మండల కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ రూపంలో యూరియా డి ఏ పి కంప్లెక్స్ మరియు పలు రకాల ఎరువులను అతి తక్కువ ధరకు అందిస్తున్న ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ అన్నారు.. గ్రామం మరియు పట్టణ అభివృద్ధి లో ప్రతి పథకం కేంద్ర ప్రభుత్వ పథకం అందులో ప్రతినెల 6 కేజీల సన్న బియ్యం, సిసి రోడ్లు అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు గర్భిణీలకు పౌష్టికాహారం దేశభద్రత దేశ రక్షణ విద్య వైద్యం ఈరోజు ప్రపంచ దేశాలలో చాలా దేశాలు కనీసం ఆహారం దొరకడం లేదు .ఇంత యుద్ధం జరుగుతున్న సందర్భాలలో కూడా భారతదేశానికి ఎలాంటి లోటు లేకుండా ప్రతి పౌరునికి కావాల్సిన ప్రతి నిత్యవసర సరుకులు పథకాలు రైతులకు ఎరువులు విద్యకు సంబంధించిన పథకాలు అందించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ది.. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బాలేశ్వర్ రెడ్డి,మరియు సర్వోత్తమ రెడ్డి తదితరులు హాజరయ్యారు..

## శాంతి భద్రతల పరిరక్షణలో జాగిలాల పాత్ర కీలకం...

**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



**నాగర్ కర్నూల్ జులై 18( స్కై న్యూస్)** నేరాల అన్వేషణలో నిందితుల గుర్తింపు మరియు విస్ఫోటక పదార్థాల ఆచూకీని గుర్తించేందుకు మరియు వీఐపీల బందోబస్తులో అదేవిధంగా ఇష్టమైన రక్షణా విభాగాలలో పోలీస్ జాగిలాల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ వివరించారు శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ జాగిలాల భవనాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో నూతన కేంద్రాన్ని నిర్మించారని తెలిపారు. జిల్లాలో ఏడు పోలీస్ జాగిలాలు ఉన్నాయని వాటిలో బ్రూనో, బోల్ట్, ధ్రువ, టీనా, జాస్మిన్, రాడో, మరియు రాణా లు విధి నిర్వహణలో ఉన్నాయని తెలిపారు. జాగిలాలకు అనువైన వాతావరణం మెరుగైన వసతులు కల్పించాలని భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డిఎస్పి బుర్రి శ్రీనివాస్ సిఐ అశోక్ రెడ్డి కొల్లాపూర్ సిఐ శంకర్ రిజర్వు ఇన్స్పెక్టర్ జగన్ రాఘవరావు ఆర్ఎస్ఐలు ప్రశాంత్ శివాజీ కళ్యాణ్ గౌస్ పాషా రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఏడుపాయల వనదుర్గా మాతను దర్శించుకున్న మాఅసోసియేషన్ అధ్యక్షులు

**సినీ నటుడు మంచు విష్ణు**

**పాపన్నపేట,జూలై18 (వార్తతరంగాలు):**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీఏడుపాయల వనదుర్గామాతను శనివారం రోజు మా అసోసియేషన్ అధ్యక్షులు,సినీనటుడు మంచు విష్ణు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంచు విష్ణు ఏడుపాయలకు చేరుకోగానే అదనపు కలెక్టర్ నగేష్ మొక్కను అందించి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర , ప్రాముఖ్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంచు విష్ణు కు వివరించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చారిత్రక నేపథ్యం కలిగిన మెదక్ ఖిల్లా సందర్శించి దాని చరిత్రను జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెదక్ చర్చిని సందర్శించి ప్రత్యేక



ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన, వారసత్వ సంపదకు మెదక్ జిల్లా నిలయమన్నారు. భవిష్యత్తులో నేను నటించే సినిమా గానీ,ప్రొడ్యూసర్ గానీ చేసే సినిమాలో మెదక్ నుండే ఒక అవకాశం ఇస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి



రమేష్,మెదక్ యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్,మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ నవీన్ కుమార్,కౌన్సిలర్లు,మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్,పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుద్దూర్‌గూడ రైతులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి అరెస్ట్

**నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలింపు..**

**షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం**

**రంగారెడ్డి జిల్లా జూలై 18 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహుద్దూర్‌గూడలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ టెర్మినల్ కోసం భూముల సేకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబల్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కార్తీక్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన కార్తీక్ రెడ్డి,



అరెస్టులతో భయపడేది లేదని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన పరిహారం, స్పష్టమైన హామీలు ఇవ్వకుండా భూముల సేకరణ చేపట్టడం తగదని



విమర్శించారు. బహుద్దూర్‌గూడ రైతుల హక్కుల పరిరక్షణ కోసం తమ ఉద్యమం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## రైతుల అరెస్టులకు నిరసనగా నందిగామ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన



**రంగారెడ్డి జిల్లా జూలై 18 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీస్ స్టేషన్ ఎదుట ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. రైతుల తరపున పోరాడుతున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, రైతులను అరెస్ట్ చేయడాన్ని వారు ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా చేన్నకేసి ఎల్లేశ్



హైద్రాబాద్ జులై 18;బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా చేన్నకేసి ఎల్లేశ్ నియమితులయ్యారు ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఎల్లయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ హైదరాబాదులోబిసి లు ముక్యంగా విద్యార్థులు యువత బిసి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి చేస్తూ పెద్ద ఎత్తున పోరాట చేయాలని పిలుపునిచ్చారు ముఖ్యంగా బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఫీజు రియంబర్స్మెంట్ పై ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని ఆయన పేర్కొన్నారు .అనంతరం చేన్నకేసి ఎల్లేశ్ మాట్లాడుతూ తనపై గల నమ్మకంతో తనకు గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రదానకార్యదర్శిగా నియమించినందుకు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు హైదరాబాద్ పరిధిలో బీసీల సమస్యలు విద్యార్థుల సమస్యల పరిహకారం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## ముచ్చోనిగూడా తండాలో తాగునీటి కోసం ప్రజల తండ్లాట



**రంగారెడ్డి జిల్లా జులై 18 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని కుందేలుకుంట గ్రామపంచాయతీ పరిధి ముచ్చోనిగూడా తండాలో గత నెల రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు అందక బోరుబావి నీటిని ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో రోడ్డుపై నిరసన చేపట్టి, తాగునీరు లేక వంట, స్నానాలు, ఇతర నిత్యావసరాలు కూడా కష్టంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

## కొత్తగూడెం ఏరియాలో ఘనంగా తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు




**సింగరేణి జూలై 18 (స్కై న్యూస్ ):**తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ఏరియా లో గల అన్నీ మైన్స్ / డిపార్ట్మెంట్ లలో శనివారం న ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేమ్ రాజు ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి ఉద్యోగులకు అభినందించారు. ఈ సందర్భంగా జియం ఎం. షాలేమ్ రాజు మాట్లాడుతూ, తాడిచర్ల-2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని జియం పేర్కొన్నారు. ఈ విజయోత్సవం మన సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో తాడిచర్ల--2 బ్లాక్ కేటాయింపు విజయోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ స్వీట్లు పంపిణీ చేసి తాడిచర్ల-2 బ్లాక్ సాధన పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తూ, తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు.అనంతరం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు, మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు.అన్ని గనులు విభాగాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడము జరిగినది.ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు వికెసీఎం జీఎం కార్యలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి. నరసింహరావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు , ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఎస్వోటు జీఎం ఎం గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి , ఏరియా ఇంజినీర్ వి రామకృష్ణ , ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు , డిజిఎం (ఐఈడి) యోహన్ , ఇన్‌చార్జ్ (సివిల్) కె. రాజారాం డివైపిఎం హరీష్ , ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య , ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సౌజన్య ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ సాగర్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి..

**జీవో నెంబర్ ఆర్ఆర్ యాక్టును రద్దు చేయాలి....**

**నాగర్ కర్నూల్ జులై 18 (స్కై న్యూస్)** ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించవలసిన ఎనిమిది వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జీవో నెంబర్ ఆర్ఆర్ యాక్టును రద్దుచేసి 14 లక్షల విద్యార్థులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అరవింద్ చారి డిమాండ్ చేశారు శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో విద్యార్థులకు ఎలాంటి బకాయిలు లేకుండా వెంటనే విడుదల చేసి విద్యాసంక్షేమానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేద మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొని ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో ఇంజనీరింగ్ పీజీ ఎంబీఏ ఎంసీఏ తో పాటు పలు కోర్సులలో విద్యార్థులకు స్కాలర్షిప్లు మరియు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించి పేద విద్యార్థుల ఉన్నత విద్యకు దోహదం చేశారని అన్నారు. విద్యార్థులకు చెల్లించవలసిన



బకాయిలను చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బకాయిలను చెల్లించకపోవడం వల్ల ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం లేదని డబ్బులు చెల్లించి తీసుకోవాలని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు దీనివల్ల విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి నెలకొని ఉందని విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బకాయిలను వెంటనే విడుదల చేయాలని అనే డిమాండ్ చేశారు ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి నాయకులు పూజ సౌమ్య సాయి శ్రీజ సరస్వతీ లావణ్య నవనీత శివాని స్రవంతి కవిత పల్లవి మల్లేష్ గౌతం మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు

## యువ సంగ్రామ సదస్సుకు వెళ్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కాన్వాయిని అడ్డుకున్న పోలీసులు



**రంగారెడ్డి జిల్లా జులై 18 (స్కై న్యూస్):** షాద్‌నగర్ నుంచి సరూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు సుమారు 400 వాహనాలతో బయలుదేరిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి కాన్వాయిని ఔటర్ గోల్కొండ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. హైకోర్టు సభకు అనుమతి ఇచ్చినప్పటికీ పోలీసులు అడ్డుకోవడం ఎందుకని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని ఆరోపించారు. అనంతరం పోలీసులతో చర్చల తర్వాత తాను యువ సంగ్రామ సదస్సుకు బయలుదేరినట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా సభను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.

# రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం

**తెల్కపల్లి 18 జులై (స్కై న్యూస్):**ఈ రోజు గడ్డంపల్లి, పెద్దపల్లి , గ్రామంలలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ వానాకాలంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రైతులు అధిక నీటి అవసరం ఉండే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల కంది, మినుము, పెసరతో పాటు ఇతర పప్పుధాన్య పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు మెరుగుపడే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణలో వానాకాలం పప్పు **పంటల విత్తే సమయం:**

- **పెసర:** జూన్ రెండో పక్షం నుండి జూలై చివరి వారం వరకు.
- **మినుము:** జూలై మొదటి వారం నుండి ఆగస్టు మొదటి వారం వరకు.
- **కంది:** జూన్ రెండో పక్షం నుండి జూలై చివరి వారం



వరకు.

రైతులు స్థానిక వర్షపాతం, నేల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సరైన సమయంలో విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ విజయ్ కుమార్ గారు, మండల వ్యవసాయ అధికారి పి. నర్మద గారు, వ్యవసాయ విస్తరణ అధికార్లు అన్వర్ పాషా, శివకృష్ణ గారు, పంచాయతీ కార్యదర్శిలు శ్రీకాంత్ గారు, రాజు గారు ఊరా రాంగోపాల్ గారు, గ్రామ పెద్దలు శేఖర్ గారు, వెంకటస్వామి గారు మరియు గ్రామల రైతులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ డిజిటలైజేషన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ షాద్‌నగర్ కు ప్రశంసలు



**రంగారెడ్డి జిల్లా జులై 18 (స్కై న్యూస్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఎన్యూమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియలో రంగారెడ్డి జిల్లాలో షాద్‌నగర్ నియోజకవర్గం ముందంజలో నిలవడంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నియోజకవర్గంలోని బీఎల్ఏల పనితీరు, డిజిటలైజేషన్ పురోగతి నివేదికను ఆమెకు అందజేశారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన (ఎస్ఐఆర్) కోఆర్డినేటర్ పురుషోత్తం రెడ్డిని కూడా మీనాక్షి నటరాజన్‌కు పరిచయం చేస్తూ ఎమ్మెల్యే ప్రశంసించారు. పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

# అణచివేతలపై ఉద్యమించక తప్పదు

**హక్కుల సాధనకు ఐక్యత అవసరం**
**ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు**
**గిరిజనుల సమస్యలపై రాజీలేని పోరాటం**
**భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,**
**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**పాల్వంచ జూలై 18( స్కై న్యూస్)::** తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పాల్వంచలో జరిగిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అడవిపై ఆధారపడి బతుకుతున్న గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పాలకుల అణచివేత వైఖరిపై గిరిజన లోకం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ మహాసభల ద్వారా గిరిజనులపై సమగ్ర కార్యాచరణను రూపొందించి, రాబోయే రోజుల్లో బలమైన పోరాటాలు నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తిగా కుంటుపడిందని, విద్యా, వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల పేద గిరిజన విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతోందని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకుల్లో మార్పు రావడం లేదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పాలకులంతా వారిని వాడుకుంటున్నారని విమర్శించారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులను ఇతర రంగాలకు మళ్లించడాన్ని తక్షణమే ఆపాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని, శాసనసభ లోపలా, వెలుపలా వారి గొంతుకగా నిలుస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కొండంత అండగా ఉన్న ఉపాధి హామీ పథకం పేరు మార్చి, దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి కల్పనను దెబ్బతీసే ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఉపాధి హామీ నిధులను తగ్గించడం వల్ల వలసలు పెరిగిపోయే ప్రమాదం ఉందని, స్థానికంగానే పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏల పనితీరును మెరుగుపరచాలని, స్థానిక సంస్థలకు నిధులు, విధులను బదిలీ చేయాలని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పోడు భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరినీ ఏకం చేసి, హక్కుల సాధన కోసం అతిపెద్ద జాతీయ ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రామావత్ అంజయ్య నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, సరిరెడ్డి పుల్లారెడ్డి, ఎస్ కె సలీం, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య నాయకులు జువారి రమేష్ నాయక్, స్వరూప, సొందు కుటుంబరావు, భూక్యా శ్రీనివాస్, బి వెంకట్, బానోతు రాంబాబు, గణేష్, వివిధ జిల్లాల ప్రతినిధులు, స్థానిక సంస్థలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులకు అండగా జనసేన. డా. గడల శ్రీనివాసరావు

**అశ్వాపురం ఘటనను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది**
**ఆదివాసీ మహిళల గౌరవం, హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలి**




**కొత్తగూడెం జూలై 18( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం, మనుబోతుల పాడు గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ మహిళలతో అధికారులు దురుసుగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి అని డా. గడల శ్రీనివాసరావు మాజీ ఆరోగ్య సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ మహిళల గౌరవం, భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు ప్రజాస్వామ్య విలువలపై తీవ్రమైన దాడిగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రతి మహిళ గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉంది. ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల అధికార యంత్రాంగం అత్యంత సున్నితంగా, మానవీయంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిష్పక్షపాత, పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తోంది. అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళల గౌరవాన్ని, ఆదివాసీల హక్కులను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం యొక్క రాజ్యాంగబద్ధ బాధ్యత. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థే భయాందోళనలకు కారణమవ్వకూడదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. ఆదివాసీ మహిళల గౌరవాన్ని కాపాడటం అంటే మన సమాజ గౌరవాన్ని కాపాడటమే. వారిపై ఎలాంటి అవమానం, అన్యాయం లేదా దౌర్జన్యాన్నీ నాగరిక సమాజం సహించదు. జనసేన పార్టీ మహిళల గౌరవం, భద్రత, ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ విషయంలో ఎప్పుడూ రాజీపడదు. న్యాయం, మానవత్వం, సమానత్వం అనే విలువల పట్ల తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించి, తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఆదివాసీ మహిళ గౌరవం కేవలం ఒక వ్యక్తి గౌరవం కాదు అది మన రాజ్యాంగం, మన సమాజం, మన మానవత్వానికి ప్రతిబింబం అని డా. గడల శ్రీనివాసరావు మాజీ ఆరోగ్య సంచాలకులు, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు అన్నారు.

# ప్రభుత్వ భూమిలో పార్టీ కార్యాలయాన్ని నిర్మించొద్దు

**స్థలాన్ని బడుగు బలహీన వర్గాలకు పంచాలి**





**నాగర్ కర్నూల్ జూలై 18 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న సర్వే నెంబరు 365 లో నిషేధిత ప్రభుత్వ జాబితాలో ఉన్న స్థలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వెంటనే కార్యాలయ నిర్మాణ పనులను అడ్డుకొని ఆ స్థలంలో బడుగు బలహీన వర్గాలకు పేదలకు కష్టజీవులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్ అధ్యక్షత వహించారు ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పృథ్వీరాజ్ ఉమ్మడి జిల్లా జోన్ ఇంచార్జ్ యోసేఫ్ బిజెపి జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గుట విజయ్ మాదిగ డిబిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గుడిపల్లి రవి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు ఎంహెచ్ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు నిజం బీఎస్పీ పార్లమెంటు ఇంచార్జ్ కళ్యాణ్ మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నెంబర్ 367 ప్రభుత్వ భూమి అని పేర్కొన్నారని ఇలాంటి భూమి క్రయ విక్రయాలు చేయవద్దని జాబితాలో ఉన్నప్పటికీ గతంలో రెవెన్యూ అధికారులు కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టడం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లేనని మండిపడ్డారు. నిషేధిత స్థలంలో అధికార పార్టీ కార్యాలయాన్ని ఎలా నిర్మిస్తారని నిలదీశారు పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు సొంత డబ్బులను చెల్లించి తలం కొనుగోలు చేసి కార్యాలయం నిర్మించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ స్థలంలో నిర్మించుకుంటే అడ్డుకొని తిరుగుతామన్నారు. ప్రభుత్వం సంచార జీవితం గడుపుతున్న కష్ట జీవులు గుడారాలు వేసుకుంటే వాటిని తొలగించారని మరి కాంగ్రెస్ పార్టీ భవనం నిర్మించుకుంటుంటే ఎందుకు పనులు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రధాన రహదారిపై అనేకమంది చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని వారి ఉపాధిని తీసే విధంగా స్థలాల నుండి వెళ్లగొడుతున్న మున్సిపల్ అధికారులకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం కనిపించడం లేదా అని ప్రశ్నించారు వెంటనే పనులను ఆపకపోతే లోకయుక్తలో అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు అధికారులు వెంటనే నిర్మాణం పండ్లను అడ్డుకొని చిత్తశుద్ధి నుండి నిరూపించుకోవాలని కోరారు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎంపీ మంత్రులు వెంటనే దీనిపై స్పందించి నిర్మాణాన్ని ఆపాలని కోరారు గత ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలను తీసుకొని పార్టీ కార్యాలయాలు పల్లె ప్రకృతి వనాలు స్మశానవాటికలు రైతుకు వేదికలు నిర్మించాయని మళ్లీ అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల స్థలాలలో పార్టీ కార్యాలయాలు నిర్మిస్తున్నాయని మండిపడ్డారు ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగయ్య బీఎస్పీ జిల్లా నాయకులు అచ్చంపేట ఇన్చార్జి కృపానందం తో పాటు బరిదల శ్రీను ఆంజనేయులు శివ మధు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# నిందితుల అరెస్టు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**చోరీ చేసిన సొమ్ము విక్రయం చేస్తే శిక్ష తప్పదు**
**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**





**నాగర్ కర్నూల్ జులై 18 (స్కై న్యూస్)** నాగర్ కర్నూల్ మరియు బిజినేపల్లి పట్టణాలలో పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి 52 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ వివరించారు శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి భారీ ఎత్తున ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న దొంగలను అదుపులోకి తీసుకొని పెద్ద సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై జోంగం యాదయ్య చింతకాయల కృష్ణంరాజు రావడం జరిగిందని వారిని ప్రశ్నిస్తుండగా వాహనం వదిలి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించగా తాము వాహనాలను చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటామని పోలీసులకు తెలపడంతో వారిని అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారించినట్లు తెలిపారు అదేవిధంగా బిజినేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పిట్టల సాయిచరణ్ అదుపులోకి తీసుకొని విచారించగా మంగనూరు గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ తమకు వాహనాలను దొంగిలించి తీసుకువచ్చి ఇస్తాడని వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటామని తెలపడంతో విచారణ జరిపించి అతనిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు ప్రధాన సూత్రధారి సంతోష్ నాయక్ ప్రస్తుతం మహబూబ్నగర్ జైలులో ఉన్నట్లు వివరించారు వాహనాల రికవరీలో పోలీసులు ప్రదర్శించిన తీరు ప్రశంసనీయమని అభినందించారు. చోరీ చేసిన సొమ్మును కొనుగోలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వివరించారు వాహనాలు చోరీ అయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు కేసులు చేదించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ అశోక్ రెడ్డి ఎస్సైలు గోవర్ధన్ శంషుద్దీన్ తోపాటు పోలీసు సిబ్బంది భీముడు వెంకటేష్ ప్రవీణ్ రమేష్ తదితరులను ఎస్పీ అభినందించారు ఈ సమావేశంలో డిఎస్పి శ్రీనివాస్ యాదవ్ సిఐ అశోక్ రెడ్డి ఎస్సై గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ అభయాంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నేతలు





**ఆత్మకూరు జులై 18(స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులైన డాక్టర్ వాకిటి శ్రీహరి గారు త్వరగా కోలుకోవాలని బాలకృష్ణ పురం ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ ఎండి రహమతుల్లా గారు ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ నాగమణి గారు వైస్ చైర్మన్ శ్రీనివాసులు గారు మాజీ టౌన్ ప్రెసిడెంట్ పరమేష్ గారు మరియు ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్షర టెక్నో స్కూల్ నాగేష్ టీచర్ గారు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులుమరియు వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గణేష బాలకృష్ణపూర్సర్పంచ్ మనివర్ధన్ రెడ్డి గంగ తులసిరాజు యాదవ్ మరియు తదితర వ్యక్తులు పాల్గొన్నారు

## శ్రీ శ్రీ శ్రీపోచమ్మ తల్లి బోనాల పండుగ మహోత్సవం...



**ఆత్మకూరు జులై 18(స్కై న్యూస్)** ఆత్మకూరు పట్టణంలో ప్రజలకు విజ్ఞప్తి ఆత్మకూరు పట్టణంలో ప్రజలకు నమస్కరిస్తూ ఆత్మకూరు పట్టణంలో ప్రతి సంవత్సరం ఆషాడమాసం ఆనవాయితీగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగ మహోత్సవాన్ని ఈ సంవత్సరం కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని పెద్దమ్మ తల్లి దేవాలయం కమిటీ మున్సిపల్ పాలకమండలి మరియు పట్టణ పెద్దలను నియమించడం అయినది బోనాల పండుగ సందర్భంగా జులై మొదటి వారం లేదా రెండో వారంలో జరగవలసిన పోచమ్మ పండుగ వాయిదా పడడంఅందరికీ తెలిసిన విషయమే ఎందుకంటే ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో పెద్దమ్మ తల్లి పండుగ జరుపుకోవడం వల్ల ప్రజలకు ఖర్చులు అధికం కావడం వల్ల కాస్త పండుగను వాయిదా వేయడం జరిగింది జులై నాలుగో వారం 28-7-2026 రోజు శ్రీ శ్రీశ్రీ పోచమ్మ పండుగ సందర్భంగా అమ్మవారి నీ జరుపుకోవాలని అని కమిటీ పెద్దలు నిర్ణయించడంజరిగింది

## మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటన ఉపేక్షించేది లేదని చంద్రబాబు హెచ్చరిక



**గుంటూరు, జూలై 18:** గుంటూరు జిల్లాలో ఒక మహిళ పట్ల జరిగిన అమానుష దాడి ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న ఆయన.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా, ఏ పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. సమాజంలో ఏ మహిళను అవమానించినా, వారిపై దాడులకు తెగబడినా అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, అలాంటి అనాగరిక చర్యలకు మన సమాజంలో చోటు లేదని చంద్రబాబు మండిపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి, నిందితులపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ దారుణానికి ఒడిగట్టిన వారిపై ఇప్పటికే పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడు మూర్తిని అరెస్టు చేశారు. అతను టీడీపీకి చెందిన వ్యక్తి అని తెలియడంతో... చంద్రబాబు ఏమాత్రం వెనుకాడకుండా అతడిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ పార్టీలతో అనుబంధం ఉందనే నెపంతో తప్పు చేసి తప్పించుకోవచ్చని చూస్తే కుదరదని, ఏ ఒక్కరికీ ప్రభుత్వం తరఫున ఎలాంటి రక్షణ లభించదని ముఖ్యమంత్రి కరాఖండిగా తేల్చి చెప్పారు. ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా చట్టాన్ని నిష్పక్షపాతంగా, పకడ్బందీగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ఏకైక విధానమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి మహిళకు తమ గౌరవానికి, భద్రతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నూతన సమాజంలో మహిళలు పూర్తి ధీమాతో, రక్షణతో బతకాలన్నదే తమ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఘటన వివరాల్లోకి వెళితే... నడిరోడ్డుపై అంతా చూస్తుండగానే మహిళను వివస్త్రను చేసి, పిడిగుద్దులతో దాడి చేశారు. దాడి అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. అయితే ఈ సదరు మహిళ పోలీసుకు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేసింది. కానీ ఈ దాడికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసుకొని మూర్తి సహా దాడి చేసిన అందరిని అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు మూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

## గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీకి ఘన సన్మానం

**ఆసిఫాబాద్, జూలై 18:**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు నూతనంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీని టీఎస్‌టి బ్యూటీయూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సమర్ధవంతమైన నాయకత్వం అందిస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏం ఆర్ సి ఏ సి ఏం ఓ పూర్కా ఉద్దవ్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడా అధికారి మడావి శేఖు, ఏ టి డి ఓలు చిరంజీవి, భాస్కర్, టీఎస్‌టి బ్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నైతం కృష్ణ రావ్, సంఘం అధ్యక్షులు కొట్నాక్ యాదవరావ్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మడావి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడెం రవీందర్, కూడ్మేత అనంత్, వెడ్మ యశ్వంత్ రావ్, మడావి పోచాని, షెడ్మాకీ వెంకటేష్, బండ మీనారెడ్డి, చాకిలం మధు, చంద్రశేఖర్ పవార్ లింబారావ్, కూడ్మేత జంగు, నందారాం, మడావి లచ్చు తో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

## డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

**దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదల**




**కరీంనగర్::** 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదలైనట్లు ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏతో పాటు ఏఈడీపీ బీఎస్సీ హెల్త్ కేర్ తదితర కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూలై 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు, జూలై 20 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జూలై 30న సీట్ల కేటాయింపు జరగనుండగా, జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, జూలై 31 నుంచి ఆగస్టు 1లోపు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. మూడు విడతల్లో ప్రవేశం పొందని విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండానే స్పెషల్ ఫేజ్‌లో పాల్గొనవచ్చని, కొత్తగా నమోదు చేసుకునేవారు రూ.400 ఫీజు చెల్లించాలని తెలిపారు. నిర్ణీత గడువులో రిపోర్ట్ చేయని పక్షంలో కేటాయించిన సీటు రద్దు అవుతుందని హెచ్చరించారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన..

ఏఈఓ రాకేష్

**తాండూర్:**మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కిష్టంపేట క్లస్టర్ పరిధిలోని కాసిపేట్ గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం, పంట వైవిధ్యం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ రాకేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులుగా కంది, పెసర, మినుము, శెనగ, జొన్న వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించడంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా, పంట రుణాలు, విత్తన సబ్సిడీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో పంటల వైవిధ్యమే సమర్థవంతమైన మార్గమని, దీనివల్ల రైతుల నష్టాలు తగ్గి ఆదాయం స్థిరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అధికారుల నుంచి సూచనలు, సలహాలు పొందారు

# గిరిజన చట్టాలను కాలరాస్తూ అక్రమ సెల్లర్ నిర్మాణాలు

**విద్యానగర్ లో వింత పోకడ కన్నెత్తి చూడని అధికారులు**
**అక్రమ సెల్లర్ నిర్మాణంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు**
**అక్రమ నిర్మాణాలపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి**
**గిరిజనేతరులు బహుళ అంతస్తుల నిర్మాణాలు కడుతున్న పట్టించుకోరా?**
**అక్రమ సెల్లార్ నిర్మాణం వైపు కన్నెత్తి చూడని అధికారులు**
**జిల్లా కలెక్టర్ జిల్లా డిపిఓ ఒకసారి పరిశీలిస్తే బాగుంటుంది**



**చుంచుపల్లి జూలై 18 (స్కై న్యూస్):** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బఫర్ జోన్ లో అక్రమ సెల్లర్ నిర్మాణం నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేని పరిస్థితి కనిపిస్తుంది. సర్వేనెంబర్ 51/4 లో ఇంటి నెంబర్ 3-1-236/4 డి టి సి పి ఓ నుండి ఎటువంటి అనుమతులు లేవు .గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ బహుళ అంతస్తుల నిర్మాణాలకి రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ సెల్లర్ నిర్మాణం పనులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గత రెండు నెలలుగా పలు దినపత్రికలలో ప్రచురిస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకుల అధికారుల అండదండలతో అక్రమ సెల్లార్ నిర్మాణం జోరుగా కొనసాగుతుంది అక్రమ సెల్లర్ నిర్మాణం తో విద్యానగర్ రోడ్లు బురదతో ప్రజలకు వాహనదారులకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాయి ఇవేమీ మాకు తెలియదు అన్నట్టుగా యజమానులు వ్యవహరిస్తున్నారు ఇంత తతంగం రెండు నెలలుగా జరుగుతున్న అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చాము చర్యలు తీసుకుంటాము తప్ప చేసేదేమీ లేని పరిస్థితి కనిపిస్తుంది పంచాయతీరాజ్ చట్ట ప్రకారం నోటీసులు అందజేసిన సందర్భంలో ఏడు రోజులలో వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో ఉంటుంది కానీ ఏ అధికారిని అడిగినా నోటీసులు ఇచ్చామని మాట తప్ప దానిపై చర్యలు తీసుకుంటామన్న నమ్మకం లేకపోయింది



.పంచాయతీ సెక్రెటరీ చుంచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు పట్టించుకున్న దాఖలాల్ లేదు రోడ్డు మొత్తం ఆక్రమించి పెద్దపెద్ద వాహనాలతో ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకే చోటు ఉందా అని సందేహం వెలివేర్చుతున్న కొత్తగూడెం విద్యానగర్ ప్రజలు. సెల్లార్ నిర్మాణం పక్కనే నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే బ్యాంకు సైతం ఉంది బ్యాంకుకు వచ్చే వాళ్ళు పోయే వాళ్లతో ఆ ఏరియా కిటకిటలాడుతుంది అయినప్పటికీ అవేవీ లెక్కచేయకుండా అక్రమ నిర్మాణదారులు ప్రజాప్రతినిధులు అధికారుల అండదండలతో రోడ్లపై వాహనాలు నిలిపి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు బ్యాంకు బిల్డింగ్ యజమాని స్థలాన్ని సైతం అక్రమ సెల్లార్ నిర్మాణదారులు ఆక్రమించారని గుసగుసలు వినిపిస్తున్నాయి .అక్రమ సెల్లార్ నిర్మాణమే తప్పు అంటే పక్కవారి స్థలాన్ని సైతం కబ్జా చేసి అక్రమ సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారంటే అక్కడి ప్రజా ప్రతినిధుల చేతగానితనమా లేక అధికారుల నిర్లక్ష్యమా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి .గత రెండు నెలలుగా పునాది మొదలుకొని ఇప్పటివరకు ఎన్నో దినపత్రికలలో ప్రచురిస్తున్నప్పటికీ అవి ఏమి లెక్కచేయకుండా నేనే రాజు నేనే మంత్రి అన్నట్టుగా అక్కడి ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని అక్రమ నిర్మాణాదారులకు అండగా నిలుస్తూ ప్రోత్సహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా డిపిఓ ఒకసారి స్పందిస్తే తప్ప ఈ అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయవచ్చని గిరిజన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని పలువురు కోరుతున్నారు. గిరిజన నాయకులు జాడ లేకుండా ఉన్నదని విద్యానగర్లో చిన్న చిన్న స్థలాల వద్ద గిరిజన నాయకులు హడావుడి చేసిన సందర్భాలు ఉన్నాయని కానీ ఇక్కడ గిరిజన చట్టాలని తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణాలు చేపెడుతున్న గిరిజన నాయకులు ఎందుకు స్పందించడం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వఇప్పటికైనా గిరిజన నాయకులు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ సెల్లర్ నిర్మాణాలని కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు.

# ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల రెంటు రూ.55 వేలకు పెంచాలి

**పాత బకాయిలు వెంటనే చెల్లించాలి**
**తెలంగాణా అద్దె వాహనాల సంఘం డిమాండ్**
**ఆర్.కృష్ణయ్య హామీమేరకు సమ్మె విరమణ**

**హైద్రాబాద్ జులై 18 :**ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల వేతనము పెంచాలని తెలంగాణా అద్దె వాహనాల సంఘం డిమాండ్ చేసింది.అద్దె వాహనాల వేతనము పెంపు కొరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది ఈ సమావేశానికి సంఘం అధ్యక్షులు నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మదాసు రాజు అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల వేతనము పెంపు 9 సం" పెంచలేదు. రాష్ట్ర ప్రభుత్వ అద్దె వాహనాల రెట్లు ను 34వేల నుంచి 55 వేలకు పెందాలని, ఒక సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉన్న అద్దె వాహనాల రెంటును చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వీరికి ఇస్తున్న అద్దె 9 సంవత్సరాల క్రితం 2017లో నిర్ణయించారు. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి ద్రవ్యల్బం పెరిగింది కార్ల అద్దె పెంచవలసిన ఆవశ్యకత ఉంది అద్యకార్లకు ఇచ్చే రెంటు ఒక ప్రభుత్వం అటెండర్ ఇచ్చే జీతంకు సరిపోదు ప్రభుత్వం నడిపే సంతకారులకు ఒక్కొక్క దానికి డ్రైవర్ జీతం 50,000 డీజిల్




30000 రిపేర్లు ఆయిలు మెయింటెనెన్స్ 20000 మొత్తం ఒక లక్ష ఖర్చవుతుంది ఇక్కడ బ్యాంకు రుణాలపై తెచ్చిన కార్లకు 34,000 ఇస్తే ఎలా సరిపోతాయని కృష్ణయ్య ప్రశ్నించారు.ప్రభుత్వ కార్యాలయంలో అద్దె వాహనాలు నడుపుతున్న 2017 సం॥లో ప్రభుత్వం వారు నెలకు రూ:-34,000/-రెండు పిక్స్ చేశారు. అప్పటి నుండి ఇదే కొనసాగటం వలన ఇప్పుడు అధికంగా పెరిగిన ధరల వలన గిట్టుబాటు అవటం లేదు, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకి పెరుగుతున్న ధరలు, పెరిగిన పెట్రోల్, డిజిల్ ఖర్చుల వల్ల అనేక కష్టాలు పడుతున్నారు.2017 సం॥ లో లీటరు, డిజిల్ కు రూ.64/-లు యుండేది. కానీ ప్రస్తుతం రూ:-110/-లకి పెరిగింది, కావున అద్దె వాహనాల వేతనము ప్రస్తుతం ఉన్న డిజిల్ పెట్రోల్ ఇతర దరలకు అనుగుణంగా పెంచాలి.అలాగే నిత్యావసర వస్తువుల ధరల పెరిగాయి. కుటుంబాలను ఎలా పోషించాలి. అలాగే అలాగే బ్యాంకు రునలుకు జువీ×లు ఎలా కట్టాలి. కార్లు ఆయిల్ పిల్లల ఫీజులు ఎలా కట్టాలి. రిపేర్లు ఎలా చేయాలి. మెంటినేన్స్ ఎలా? ప్రస్తుతం ఇచ్చే 34 వేలు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు.గతంలో కుడా చాల అధికారులకు, కూడా విన్నవించుకున్నాము కాని ఎటువంటి స్పందనలేదు. సంవత్సరం నుండి బిల్లులు చెల్లించటంలేదు. అప్పులు చేసి వాహనం నడుపటం వలన ఆర్థికంగా తట్టుకోలేక ఆత్మహత్యలకు దారితీస్తుందన్నారు

**సమ్మె విరమించండి :**
గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా కార్ల డ్రైవర్లకు సమ్మె విరమిందాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. కృష్ణయ్య పిలుపు మేరకు సమ్మెను విరమిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మద్రాసు రాజులు ప్రకటించారు.ఈ సమావేశం లో సంఘం ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆయుబ్ అలీ,అబ్దుల్ రహమాన్,షేక్ అక్బర్ పాషా,మాలరపు కృష్ణ,రాలరావు ప్రసాద్,శ్రీశైలం తదితరులు పాల్ గొన్నారు. నీల వెంకటేష్, అనంతయ్య, పర్లగోర్ల మోడీరాందేవ్ యాదవ్, రాజేందర్, వంశీ మోహన్, అంజి గౌడ్, సిద్దయ్ తదితరులు పాల్గొంటున్నారు.

## మాట ఇచ్చినాం ఖచ్చితంగా అమలు చేస్తాం

**: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**మహబూబ్ నగర్, జులై 18(స్కైన్యూస్):**కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యే గారిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొంత వెసులుబాటు వచ్చిన తరువాత ఉద్యోగులకు పదవీవిరమణ అనంతరం పాత విధానంలోనే పెన్షన్ అమలు జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని, అలాగే సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, నాయకులు చంద్ర నాయక్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన అనిల్ కుమార్ యాదవ్






**హైద్రాబాద్ జులై 18 :**నగరంలో జరుగుతున్న జరుగుతున్న ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నగర కార్యదర్శి సెటివిన్ మాజీ డైరెక్టర్ ఎస్.ధనరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన బోనాల పోస్టర్ ను రాజ్యసభ సభ్యులు ఎం .అనిల్ కుమార్ యాదవ్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల్లో ఒకటైన బోనాల పండుగ అన్నారు ఈ పండుగను హైద్రాబాద్ నగరం తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పల్లె పల్లెల్లో ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు నగరంలో జరుగుతున్న ఈ బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఎ. ధన్‌రాజ్ ఉ ు. సతీష్ శ్రీకాంత్ యాదవ్, డి. రాజ్ కుమార్, చంద్రమోహన్ యాదవ్, నగేష్ గౌకరన్ జీ, చిన్న నగేష్, ఆకాష్ సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రశ్నపై 'ఉపా' అస్త్రమా!



ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాల అవసరం ఎంత ముఖ్యమో, ఆ చట్టాల వినియోగంలో వివేకం అంతకన్నా ముఖ్యం. 'ప్రశ్న' అనే యూట్యూబ్ నడిపే జర్నలిస్టు రావణ్ అలియాస్ బీ జోసెఫ్‌ను ఇటీవల ఏపీ పోలీసులు యూఏపీఏ (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) కింద అరెస్టు చేయడం మౌలిక ప్రశ్నను ముందుకు తెచ్చింది. అసలు ప్రశ్న ఏమిటంటే.. తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన చట్టాన్ని వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి సరైందేనా?+వశీస్త్రత్ఖుజూష్త్రఱఎ =వటవతీవఅఎవ రావణ్ వ్యాఖ్యల్లో పాలకులకు అభ్యంతరకమైనవి ఉండొచ్చు. కానీ వాటిని ఎదుర్కొనేందుకు భారతీయ న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి. అలాంటప్పుడు నేరుగా యూఏపీఏ వంటి చట్టాన్ని ఆశ్రయించడం సహజంగానే ఆందోళన కలిగిస్తున్నది. చట్టాల ప్రయోగం నేర తీవ్రతకు అనుగుణంగా తులనాత్మకంగా ఉండనవసరం లేదా? అనేదే అసలు ప్రశ్న. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత కేంద్ర ప్రభుత్వం యూఏపీఏను మరింత కఠినతరం చేసింది. దేశ భద్రత కోసం అవసరమని చెప్పింది. చట్టం ఎంత కఠినమో, దాని వినియోగం అంత జాగ్రత్తగా ఉండాలి. లేనిపక్షంలో అది ఉగ్రవాదులను మాత్రమే కాదు, పాలక పక్షంతో విభేదించే స్వరాలను కూడా లక్ష్యంగా చేసుకొనే ప్రమాదం ఉంటుంది. 2014 తర్వాత యూఏపీఏ వినియోగంపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభమైంది. ఎంతోమంది విద్యార్థి నేతలు, రచయితలు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులపై కూడా ఈ చట్టాన్ని ప్రయోగించారు. కోర్టు తీర్పు ఇవ్వకముందే ఏండ్ల తరబడి స్వేచ్ఛను హరించడం న్యాయమా? చివరకు నిర్దోషిగా బయటకు వచ్చిన వారికి కోల్పోయిన జీవితకాలాన్ని ఎవరు ఇవ్వగలరు?

భారతీయ సమాజంలో జరిగిన ప్రతి ప్రధాన సంస్కరణ వెనుక ప్రశ్నించిన తర్కం ఉన్నది. ఒక ఆలోచనను సమర్థించే హక్కు ఎంత ముఖ్యమో, దానిని విమర్శించే హక్కు కూడా అంతే ముఖ్యం. ప్రజాస్వామ్యం బలం ఒక అభిప్రాయాన్ని రక్షించడంలో కాదు; పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలకు ఒకే వేదికపై చోటుకల్పించడంలో ఉన్నది. సంస్కరణల చరిత్రను పరిశీలిస్తే, సమాజాన్ని ప్రశ్నించిన మహనీయులు వ్యక్తిగత దూషణలను, కుల-మత విద్వేషాలను, అసభ్య పదజాలాన్ని ఆశ్రయించలేదనే వాస్తవం కనబడుతుంది. తమ వాదనలు, ఆలోచనలు, తర్కంతో మాత్రమే సమాజాన్ని వారు ప్రభావితం చేశారు. అందువల్ల భావ ప్రకటన స్వేచ్ఛను సమర్థించడమంటే అసభ్యతను సమర్థించడం కాదు. విమర్శను సమర్థించడం అంటే విద్వేషాన్ని ప్రోత్సహించడం కాదు. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు, రాజకీయ వేదికలు, ప్రజా చర్చల్లో విభేదాలను తర్కంతో కాకుండా దూషణలతో ఎదుర్కొనే ధోరణి పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదు.

ఆయన వ్యాఖ్యలు తప్పని భావిస్తే, ఆ తప్పును నిర్దిష్టంగా చూపించాలి. ఎక్కడ హద్దు దాటారో చెప్పాలి. చట్టపరంగా ప్రశ్నించాలి. కానీ ఆ ప్రక్రియలోనే చర్చను, విమర్శను, భావవ్యక్తీకరణను, ఆలోచనను, మేధో స్వేచ్ఛను భయభ్రాంతులకు గురిచేసే విధంగా యూఏపీఏ వంటి అసాధారణ చట్టాలను ప్రయోగించడం ప్రమాదకరమైన ధోరణి. ఈ రోజు రావణ్‌పై ప్రయోగించిన చట్టం రేపు మరొక జర్నలిస్టుపై, ఎల్లుండి ఒక రచయితపై, ఆ తర్వాత ఒక అధ్యాపకుడిపై లేదా ప్రతిపక్ష నాయకుడిపై ప్రయోగించబోరని ఎవరూ హామీ ఇవ్వలేరు.

ఒక దేశం బలాన్ని దాని జైళ్లు నిర్ణయించవు. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన స్వేచ్ఛ కేవలం అనుకూల అభిప్రాయాల కోసం కాదు; అసమ్మతి వ్యక్తం చేసే హక్కు కోసం కూడా. ఎందుకంటే ప్రశ్నలు లేకుండా సంస్కరణ లేదు. విభేదం లేకుండా పరిణామం లేదు. విమర్శ లేకుండా ప్రజాస్వామ్యం లేదు. భయాన్ని చట్టం సృష్టించవచ్చు. కానీ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది భయం కాదు, స్వేచ్ఛ. మౌనం కాదు, ప్రశ్న.

# అటు పంటతడి.. ఇటు కంటతడి



కళ్లముందే పారుతున్న గోదావరి నీళ్లను పాలకులు దిగువకు వదిలి వేస్తుంటే తెలంగాణ రైతులు అల్లాడిపోతున్నారు. దశాబ్దాలుగా సాగునీటి కొరతతో నలిగిపోయిన నేలకు ప్రతి చుక్క నీరు ఎంతో విలువైనది. కాళేశ్వరం లాంటి మల్టీ లెవెల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను వదిలేసి, అనవసరమైన ఊహలు, భయాల చుట్టూ పాలకులు కాలయాపన చేయడం వల్ల అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తెలంగాణ విశ్రాంత నీటిపారుదలశాఖ ఇంజినీర్లు, నిపుణులు తప్పుబడుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నీటిని ఎత్తిపోయాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మొండి కేయడం శోచనీయం. తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గోదావరి జలాలు మొత్తం దిగువకు వెళ్తున్నాయి. ఈ నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడుకుంటున్నది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టా స్థిరీకరణకు వినియోగిస్తున్నది. ఇంకా మిగిలిన నీటిని ధవళేశ్వరం బరాజ్ నుంచి డైవర్షన్ చేసి వాడుకుంటున్నది. వాళ్లు వాడుకోగా మిగిలిన నీరు మాత్రమే సముద్రం పాలవుతున్నది. మన గడ్డపై ప్రాజెక్టులు ఉండి, నది నిండుగా ప్రవహిస్తున్నా తెలంగాణ రైతులకు నీరు అందకపోవడం రైతుల్లో, ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకుండానే, సహజంగా వస్తున్న నదిని వినియోగించుకొని నీటిని లిఫ్ట్ చేసే సౌకర్యం ఉన్నది.

గోదావరి, ప్రాణహిత నదుల నుంచి మేడిగడ్డ వద్దకు కనీసం 50,000 క్యూసెక్కుల ప్రవాహం వచ్చినప్పుడు, నదిలో నీటి మట్టం సహజంగానే ౦90 నుంచి ౦91 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. బరాజ్ గేట్లన్నీ తెరిచి ఉంచినా కూడా, ఈ మట్టం వద్ద నీరు కన్నెపల్లి పంప్ హౌస్ అప్రోచ్ చానెల్‌లోకి సులభంగా ప్రవహిస్తుంది. కాబట్టి మేడిగడ్డ బరాజ్‌పై ఒత్తిడి లేకుండానే పంప్ చేసుకోవచ్చు. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపితే వచ్చే వైబ్రేషన్ల వల్ల మేడిగడ్డ బరాజ్ కూలిపోతుందన్న కాంగ్రెస్ నేతల వాదనను విశ్రాంత ఇంజినీర్లు పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. కేవలం తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు. సమైక్య రాష్ట్రంలో దశాబ్దాలుగా తెలంగాణ రైతులు అనుభవించిన వేదనకు ముగింపు పలకడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కారణాలతో కాంగ్రెస్ సర్కార్ పడావు పెట్టడం సరికాదు. వందలాది టీఎంసీల గోదావరి వరద జలాలు కండ్ల ముందే తరలిపోతుంటే, రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. పాలకులు ఊహాజనిత, కుట్ర పూరిత వైఖరితో వ్యవహరించడం తెలంగాణ రైతులకు ద్రోహం చేయడమే అవుతుంది.

ఎల్ నినో లాంటి భయంకరమైన వాతావరణ పరిస్థితిలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించకపోతే తెలంగాణ ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేసినట్టే. మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోవడాన్ని సాకుగా చూపి ఎగువన ఉన్న అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బరాజ్‌లను కూడా నిరుపయోగంగా వదిలేయడం ఎంతవరకు సమంజసం? ఈ రెండు బరాజ్‌లకు అవసరమైన చిన్నపాటి మరమ్మతులు పూర్తయి, ప్రస్తుతం అవి 100 శాతం నీటిని నిల్వ చేయడానికి, తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండు బరాజ్‌లను నింపడం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రధాన జలాశయాలను నింపే అద్భుతమైన అవకాశం ఉన్నది. కానీ, ప్రాథమిక ఇన్‌టేక్ వ్యవస్థను తాకడానికి కూడా ప్రభుత్వం నిరాకరిస్తున్నది. మోటార్లు నడిపిస్తే వాటి కంపనాలతో బరాజ్ కుంగిపోతుందని అవాస్తవాన్ని అపోహను ప్రచారం చేస్తున్నది. ఇది పూర్తిగా అబద్ధం, హాస్యాస్పదం. కన్నెపల్లి పంప్ హౌస్ నడిపిస్తే వచ్చే కంపనాల వల్ల మేడిగడ్డ బరాజ్ మరింత కూలిపోతుందనే అధికారుల వాదనను నిపుణులు పూర్తిగా కొట్టిపారేస్తున్నారు. భౌగోళికంగా కన్నెపల్లి పంప్ హౌస్ మేడిగడ్డ బరాజ్‌కు దాదాపు 1-2 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పైగా ఈ రెండింటి పునాదులు ఒకదానికొకటి సంబంధం లేని 'ఐసోలేటెడ్ ఫౌండేషన్స్'. ఇంత దూరం ఉన్నా పంపుల వల్ల బరాజ్ కూలిపోతుందనడం సాంకేతికంగా అబద్ధం. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి చెప్తున్న సాకులు. రాజకీయ లెక్కలు, బ్యూరోక్రాటిక్ సమస్యలు, పట్టింపులను పక్కనబెట్టి, ఇంజినీరింగ్ ప్రతిభకు పదును పెట్టాల్సిన సమయం ఇది. పనిచేసే స్థితిలో ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎలాంటి ముప్పు రాకుండానే, 'రన్-ఆఫ్-ది-రివర్' పద్ధతిలో నీటిని మళ్లించడం ప్రస్తుత సంక్షోభానికి తక్షణ మార్గం. ఉరకలేస్తున్న గోదావరిని తెలంగాణ జలాశయాలకు మళ్లించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. లేదంటే, నది పారినా తాగునీరు, సాగునీరు లేక తెలంగాణ కరువు కాటకాల్లో మునిగిపోతుంది. ఆ పాపం కాంగ్రెస్ పాలకులదే అవుతుంది. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

## అమెరికా అమిత్ర వైఖరి

ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హార్మూజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది. కానీ దీన్ని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారని తేలాక మిన్నకుండి పోయింది. అయినా ట్రంప్‌లో ఆగ్రహావేశాలు తగ్గలేదని తాజా సమావేశం రుజువు చేసింది. మాటలకేం... ట్రంప్ చాలా మాట్లాడారు. 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశం అనంతరం 'మోదీ మంచిగా కనబడతారు. బాగుంటారు. దేవదూత. కానీ 'కిల్లర్'. వాణిజ్య, వ్యాపార చర్చల్లో చాలా కఠినంగా, నిక్కచ్చిగా ఉంటారు' అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ఎవరైనా భారత్‌వైపు కన్నెత్తి చూస్తే వాళ్ల అంతు చూస్తామని కూడా చెప్పారు. వాణిజ్య ఒప్పందం విషయంలో చాలా దగ్గరగా వచ్చేశామని కూడా అన్నారు. కానీ చేతలు చూస్తే అందుకు అనుగుణంగా లేవు. తన ఆధ్వర్యంలోని కమాండ్లలో ఒకటైన ఇండో--పసిఫిక్ కమాండ్‌కు ఆ పేరు పెట్టింది ఆయన ఏలుబడిలోని అమెరికాయే. తిరిగి ఆయనే ఎనిమిదేళ్లనాటి ఆ పేరులో భారత్‌నుసూచించే 'ఇండో' తొలగించి ఇప్పుడు యూఎస్--పసిఫిక్ కమాండ్‌గా మార్చటం, అది కూడా ఈ సమావేశానికి కొంచెం ముందుగా చేయటం యాదృచ్ఛికమేమీ కాదు. ఇటీవల యూఎస్--పసిఫిక్ కమాండ్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను పాకిస్తాన్‌లో అంతర్భాగంగా చూపటంలోనూ అమెరికా దురుద్దేశం స్పష్టమే.

## రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ :** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మొదట పరిశీలించారు. తర్వాత చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి , ఉల్లంపల్లి గ్రామాల్లో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్స్డ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామాల్లో ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల తహసీల్దారులు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల స్కీము ఎత్తి వేయాలనే కుట్రలు మానుకోవాలి

**ఉనీ.ఔనీ.9 రద్దు చేసి - పాత పద్ధతిలో ఈ స్కీమును అమలు చేయాలి**

**ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించాలని హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి**

**హైద్రాబాద్ :** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 8 వెలకోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమునుయధాతధంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేటుముట్టడించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా విద్యార్థు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తూ మాకు న్యాయం చేయండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి కుట్ర చేస్తున్నారు అంటే 23 వేల ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తామని బహిరంగంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఎంతో ఉన్నత విద్య ప్రమాణాలతో బలహీన వర్గాల జీవితాల మార్పు, అభివృద్ధి చేస్తున్న గురుకులాలను కులాల పేరు మీద వద్దు అంటూ పెద్ద సంస్కర్త లాగా పలుకుతూ రద్దు చేసే కుట్రకు తెర తీస్తున్నారని విమర్శించారు.ఈ ముట్టడి కార్యక్రమంలో చేరుకుల రాజెందర్ ,నిఖిల్ ఎటిట్, అనంతయ్య, , కిరణ్ కుమార్, మోహన్ వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ 2026 ఫలితాలలో అగ్రస్థానంలో శ్రీ చైతన్య విద్యార్థులు

నీట్ 2026 ఫలితాలలో ఆల్ ఇండియాలోనే శ్రీ చైతన్య విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ,సీమ బొప్పన తెలియజేశారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో తెలుగు రాష్ట్రాలు సాధించిన టాప్ 10లో ఎనిమిది ర్యాంకులు చైతన్య విద్యార్థులు సాధించినవేనని తెలిపారు.రోజు రోజుకు విద్య విధానంలో వస్తున్న పెను మార్పులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ గత ఏడాది కంటే 15% ఉత్తీర్ణత ఎక్కువ సాధించడం చైతన్య విద్యాసంస్థలకే సాధ్యమైందని అన్నారు.తమ దగ్గర ఉన్న అత్యుత్తమ ఫ్యాకల్టీల నిరంతర శ్రమ,ఇన్ఫినిటీ లెర్న్ టెక్నాలజీ సహాయంతో అందించిన అత్యుత్తమ శిక్షణ వల్ల లాంగ్ టర్మ్ విద్యార్థులు కూడా అత్యధికంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.రాబోవు 2027 అకాడమిక్ సంవత్సరం నుండి మారుతున్న పరీక్ష సరళికి అనుగుణంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(అబ), ౦ఎ విధానాలతో సరికొత్త శిక్షణ అందించనున్నామని తెలిపారు. ఎందుకు సంబంధించి డిజిటల్ పరంగా సిద్ధం చేసేందుకు ఏసర్, ఇంటెల్ సంస్థలతో కలిసి శ్రీ చైతన్య అనుబంధ ఇన్ఫినిటీ లెర్న్ ఒప్పందం కుదుర్చుకుంది అని తెలిపారు. విద్యార్థుల కొరకు సరికొత్తగా నీట్ రెడీ ల్యాప్ టాప్ ను దేశంలోనే ప్రథమంగా తమ రూపొందించమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని వారు సన్మానించారు.

## మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కుల్సుంపురలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో స్థానికులు దాడి చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళితే.. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో నివాసముండే అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి, నిలోఫర్ ఆసుపత్రి వద్ద టీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసించే 9 ఏళ్ల బాలిక పట్ల ఇటీవల అతను అనుచితంగా ప్రవర్తించాడు. బాలికకు ముద్దులు పెట్టి, ఆమె ప్రైవేట్ భాగాలను తాకినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో అది చూసిన బాలిక కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆవేశంతో అజీజ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి అజీజ్ మృతిచెందాడు.ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## బిజినెస్

### రూ.10 వేల కోట్ల కంపెనీకి బాస్.. హోమ్ లోన్ ఇవ్వని బ్యాంక్!



సొంతంగా ఒక కంపెనీని నిర్మించడం అనేది చాలా సాహసంతో కూడుకున్న పని, అది పెద్ద విజయం కూడా. అలాంటి వ్యక్తికి బ్యాంకు హోమ్ లోన్ ఇవ్వడం పెద్ద విషయం కాదని చాలామంది అనుకుంటారు. కానీ.. ఇక్కడ ఒక వ్యాపారవేత్తకు ఎదురైన సంఘటన మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఆ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఫిన్‌టెక్ సంస్థ రైజ్ (ధన్ పేరెంట్ కంపెనీ) వ్యవస్థాపకుడు ప్రవీణ్ జాధవ్ ఇటీవల హోమ్ లోన్ కోసం ఓ బ్యాంకును ఆశ్రయించారు. అయితే ఆయన దరఖాస్తును బ్యాంకు తిరస్కరించింది. కారణం ఏమిటంటే.. ఆయనను 'హై రిస్క్ బారోవర్'గా పరిగణించడం. దాదాపు 1.2 బిలియన్ డాలర్ల (రూ.10 వేల కోట్ల కంటే ఎక్కువ) విలువైన కంపెనీని నడుపుతున్న వ్యక్తికి కూడా ఈ పరిస్థితి రావడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు ఎదురైనా అనుభవాన్ని ప్రవీణ్ జాధవ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన అతి తక్కువ సమయంలోనే తెగ వైరల్ అయింది. దీంతో పలువురు స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు కూడా తమకు ఎదురైన ఇలాంటి అనుభవాలను గురించి వెల్లడించారు. నిజానికి బ్యాంకులు ఎవరి కంపెనీ విలువ ఎంత ఉందో అనే విషయాలను పరిగణలోకి తీసుకుని లోన్స్ అందించవు. లోన్ తీసుకున్న వ్యక్తి దాన్ని క్రమం తప్పకుండా తిరిగి చెల్లించగలడా.. లేదా?, అనే అంశాన్నే ప్రధానంగా పరిశీలిస్తాయి. అందుకే గతంలో తీసుకున్న లోన్స్ హిస్టరీ, ఆదాయపు పన్ను రిటర్నులు, స్థిరమైన ఆదాయం వంటి వివరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ఉద్యోగుల విషయంలో ఇది చాలా సులభం. ఎందుకంటే ప్రతి నెలా ఒకే తేదీకి జీతం వస్తుంది. శాలరీ స్లిప్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు చూసి వారి ఆదాయాన్ని సులభంగా అంచనా వేయవచ్చు. అందుకే వారికి హోమ్ లోన్ ప్రక్రియ కూడా చాలా వేగంగా లభిస్తుంది. కానీ వ్యాపారవేత్తల పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వారి ఆదాయం ప్రతి నెల ఒకేలా ఉండదు. కంపెనీ లాభాలు, డివిడెండ్లు, షేర్ల విలువ ఆధారంగా ఆదాయం మారుతూ ఉంటుంది. చాలామంది స్టార్టప్ వ్యవస్థాపకులు కంపెనీ విలువ వేల కోట్ల రూపాయలు ఉన్నా, వ్యక్తిగతంగా తక్కువ జీతమే తీసుకుంటుంటారు. ఈ కారణంగా వారి ఆదాయాన్ని బ్యాంకులు స్థిరమైనదిగా పరిగణించకపోవచ్చు.

ఈ ఘటనపై స్పందించిన బ్యాంక్‌బజార్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ రతి శెట్టి కూడా ఇదే విషయాన్ని వివరించారు. బ్యాంకులు ఆదాయం ఎంత స్థిరంగా ఉందో, తిరిగి చెల్లించే సామర్థ్యం ఎంత ఉందో మాత్రమే పరిశీలిస్తాయని చెప్పారు. అయితే సరైన ఆర్థిక పత్రాలు, పన్ను వివరాలు, ఆదాయ రికార్డులు సమర్పిస్తే.. వ్యాపారవేత్తలు కూడా రుణాలు పొందే అవకాశాలు మెరుగుపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# విప్రో ఫలితాలు వీక్!

న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం విప్రో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్ (2026--27, క్యూ1)లో కంపెనీ రూ.3,352 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో రూ.3,330 కోట్లతో పోలిస్తే లాభం దాదాపు ఫ్లాట్‌గా నమోదైంది. కాగా, మొత్తం ఆదాయం 10.6 శాతం జంప్ చేసి రూ.24,479 కోట్లకు చేరింది. గతేడాది క్యూ1లో ఆదాయం రూ.22,135 కోట్లుగా ఉంది.

**సీక్వెన్షియల్‌గా లాభం డౌన్...**

క్రితం ఏడాది చివరి క్వార్టర్ (2025--26, క్యూ4)లో నమోదైన రూ. 3,501 కోట్లతో పోలిస్తే సీక్వెన్షియల్‌గా క్యూ1 లాభం 4.2 శాతం దిగజారింది. అయితే, మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 1 శాతం పెరిగింది. గతేడాది క్యూ4లో ఆదాయం రూ. 24,236 కోట్లుగా నమోదైంది.

**గైడెన్స్.. ఫ్చ్**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఐటీ సేవల వ్యాపార ఆదాయ వృద్ధి అంచనాలు (గైడెన్స్) కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆదాయం 2.57 బిలియన్ డాలర్ల నుంచి 2.63 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని కంపెనీ పేర్కొంది. దీని ప్రకారం సీక్వెన్షియల్‌గా ఆదాయ గైడెన్స్ మైనస్ 1.5 శాతం నుంచి ప్లస్ 0.5 శాతంగా లెక్కతేలుతుంది.

**ఇతర ముఖ్యాంశాలివీ...**

ఐటీ సేవలకు సంబంధించిన ఆదాయం క్యూ1లో 2.61 బిలియన్ డాలర్లుగా నమోదైంది. సీక్వెన్షియల్‌గా 1.4 శాతం తగ్గగా, వార్షికంగా 1 శాతం పెరిగింది.

ఐటీ సేవల నిర్వహణ మార్జిన్ 16 శాతంగా నమోదైంది.




సీక్వెన్షియల్‌గా 1.3 శాతం, వార్షికంగా 1.2 శాతం తగ్గింది.

కంపెనీ వాటాదారులకు రూ. 2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 2 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి రికార్డు తేదీ ఈ నెల 27 కాగా, ఆగస్ట్ 14 లోపు చెల్లిస్తుంది.

ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 2,43,044కు చేరింది. మార్చి క్వార్టర్‌తో పోలిస్తే 888 మంది ఉద్యోగులు జతయ్యారు. ఉద్యోగుల వలసల రేటు (అట్రిషన్) 13.9 శాతంగా ఉంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ధర గురువారం 1.83 శాతం లాభపడి రూ.178 వద్ద ముగిసింది.

క్లయింట్లు టెక్నాలజీ ఆధునీకరణ స్థాయి నుంచి ఏఐ--ఆధారిత ఆపరేటింగ్ మోడల్స్ వైపు మళ్లుతున్నారు. దీనివల్ల నాణ్యత, ఉత్పాదకత మెరుగుపడుతుంది. దీనికి అనుగుణంగా విప్రో అందిస్తున్న కన్సల్టింగ్ ఆధారిత, ఏఐతో కూడిన విధానం వల్ల క్లయింట్లు తమ కీలక వ్యాపారంలో ఏఐని అమలు చేసేందుకు వీలవుతోంది. క్లయింట్లు తమ ఏఐ మార్పుల కోసం మాపై ఉంచుతున్న నమ్మకానికి, మా విస్తృత సామర్థ్యాలకు ఇది నిదర్శనం.

# ఒకే ప్లాంట్.. 30 లక్షల వెహికల్స్!

దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తన చకన్ ప్లాంట్ నుంచి 30 లక్షల (3 మిలియన్) వాహనాన్ని విడుదల చేసింది. కంపెనీ ఈ మైలురాయి యూనిట్‌గా బీఈ 6 ఎలక్ట్రిక్ కారును విడుదల చేసింది. ప్రస్తుతం మహీంద్రా చకన్ ప్లాంట్‌లో తయారు చేస్తున్న మొత్తం 19 వాహనాల్లో బీఈ6 ఎలక్ట్రిక్ ఒకటి. ఇక్కడ ప్యాసింజర్ వాహనాలు మాత్రమే కాకుండా కమర్షియల్ వాహనాల ఉత్పత్తి కూడా జరుగుతోంది. చకన్ ప్లాంట్‌లో మహీంద్రా సంస్థ ప్రారంభ ఉత్పత్తి కొంత నెమ్మదిగా సాగినప్పటికీ.. ఆ తరువాత గణనీయంగా పెరిగిందని కంపెనీ బిజినెస్ ప్రెసిడెంట్, ఆర్. వేలుసామి పేర్కొన్నారు. ఇది వినియోగదారులలో పెరుగుతున్న నమ్మకాన్ని, మా సిబ్బంది, భాగస్వాములు, సరఫరాదారుల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. మహీంద్రా 2009 డిసెంబర్‌లో చకన్ ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించింది. 2018 సెప్టెంబర్‌లో 10 లక్షల యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని దాటింది. 20 లక్షల మైలురాయి 2024 మార్చిలో చేరుకోగా.. సుమారు 27 నెలల తర్వాత, 2026 జూలైలో మూడు మిలియన్ల యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు ప్రకటించింది.



**మహీంద్రా బీఈ6**

ఇక బీఈ6 విషయానికి వస్తే.. ఇది ×చీ+ూా ఆర్కిటెక్చర్‌పై నిర్మించిన మహీంద్రా మొదటి రెండు 'బోర్న్ ఎలక్ట్రిక్' ూఖఎలలో ఒకటి. ఇది ఎక్స్ఈవీ 9ఈ కారుతో పాటు 2024 చివరలో భారతదేశంలో విడుదలైంది. దీని డెలివరీలు 2025లో ప్రారంభమయ్యాయి. దీజు 6 ఐదు ట్రిమ్ స్థాయిలలో, 59 ఎౌష్త్ర, 79 ఎౌష్త్ర బ్యాటరీ ఎంపికలతో లభిస్తుంది. ధరలు రూ. 18.90 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి.

### టీమిండియాపై ఇంగ్లండ్ గ్రాండ్ విక్టరీ..

# రూట్ సెంచరీ మిస్

కార్డిఫ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో 4 వికెట్ల తేడాతో భారత్ ఓటమి పాలైంది. టీమిండియా నిర్దేశించిన 254 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేధించింది. లక్ష్య ఛేధనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయినప్పటికీ, సీనియర్ బ్యాటర్ జోరూట్(133 బంతుల్లో 99 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. రూట్ తన 21వ వన్డే సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. గస్ అట్కిన్సన్ ఫోర్ బాది మ్యాచ్‌ను ముగించడంతో రూట్‌కు సెంచరీ చేసే అవకాశం లభించలేదు. అతడితో పాటు విల్ జాక్స్ 30 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ రెండు, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ తలా వికెట్ సాధించారు.

**కుప్పకూలిన మిడిలార్డర్**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా 44 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయింది. ఓ దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన భారత్.. మిడిలార్డర్ విఫలం కావడంతో నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. గిల్ సేన తన చివరి ఏడు వికెట్లను 55 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి(65), శ్రేయస్ అయ్యర్(66) అర్ధ శతకాలతో రాణించగా.. ఆఖరిలో జస్ప్రీత్ బుమ్రా(20) కాస్త దూకుడగా ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా అర్చర్ అట్కిన్సన్ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. సాకిబ్ మహమూద్ 2, సామ్ కర్రన్, విల్ జాక్స్ ఒక్కో వికెట్ సాధించారు. ఈ విజయంతో ఇంగ్లీష్ జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య సిరీస్ డిసైడర్ మూడో వన్డే ఆదివారం జరగనుంది.




### గుర్నూర్ బ్రార్‌పై క్రమశిక్షణ చర్యలు

ఇంగ్లండ్‌తో రెండో వన్డేకు ముందు భారత యువ ఫాస్ట్ బౌలర్ గర్నూర్ బ్రార్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. తొలి వన్డేలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు బ్రార్‌కు ఒక డీమెరిట్ పాయింట్ విధిస్తూ, అధికారికంగా హెచ్చరిక జారీ చేసింది.

ఏం జరిగిందంటే..?

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ గర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదాడు. ఆ మరుసటి బంతిని ఫాలోత్రూ సమయంలో అందుకున్న బ్రార్, ఆవేశంతో డకెట్ వైపు వేగంగా విసిరాడు. డకెట్ అప్రమత్తంగా తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనను పరిశీలించిన మ్యాచ్ రిఫరీ, బ్రార్ చర్యను ప్రమాదకరంగా పరిగణించి ఐసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారు. బ్రార్ ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.9ను ఉల్లంఘించినట్లు తెలిపారు. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో




ఆటగాడిపై లేదా అతడి సమీపంలో ప్రమాదకరంగా బంతిని విసరడం క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణిస్తారు. బ్రార్ తన తప్పును అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండా కేసును ముగించారు. ఈ ఘటనకు సంబంధించి బ్రార్‌పై ఆర్థిక జరిమానా విధించలేదు. అయితే అతని ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ నమోదు చేయడంతో పాటు అధికారిక హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో బ్రార్‌కు ఇదే తొలి క్రమశిక్షణా ఉల్లంఘనగా నమోదైంది. మ్యాచ్ విషయానికొస్తే.. ఇంగ్లండ్‌పై భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొంది, 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బౌలింగ్‌లో అక్షర్ పటేల్ (4-62), బ్రార్ (2-61), ప్రసిద్ధ్ (2-50), బుమ్రా (1-31).. బ్యాటింగ్‌లో గిల్ (80), సుందర్ (52 నాటౌట్), అక్షర్ (57 నాటౌట్) సత్తా చాటి భారత్‌ను గెలిపించారు.

## స్పోర్ట్స్

### వివాదాస్పద బ్యానర్ ప్రదర్శించిన అర్జెంటీనా ప్లేయర్లు.. చర్యలు తీసుకోనున్న ఫిఫా




**అట్లాంటా:** ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు .. బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్లు జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.




## ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. ‘పౌజీ’ రిలీజ్ డేట్ వచ్చేసింది

ప్రభాస్ ప్యాన్స్‌కి గుడ్ న్యూస్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘పౌజీ’ ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 3న ఈ మూవీ విడుదల కానుంది. ఈ మేరకు చిత్రబృందం రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేసింది. అందులో ప్రభాస్.. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్నాడు. మునుపెన్నడూ ఇలాంటి పాత్రలో ప్రభాస్‌ని చూడలేదు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటించగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్ర బృందం త్వరలోనే షూటింగ్ ముగించుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ కానుంది. ప్రచారంలో భాగంగా మరికొద్ది రోజుల్లో ఈ సినిమా నుంచి ఒక లిరికల్ సాంగ్‌ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

# అప్పులోళ్లు ఇంటిమీదకు వచ్చేవాళ్లు .. కూలీ పనికి వెళ్లా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వయంకృషితో ఎదిగిన నటుల్లో తమిళ ‘మక్కల్ సెల్వన్’ విజయ్ సేతుపతి ఒకరు. కేవలం కోలీవుడ్‌లోనే కాకుండా టాలీవుడ్‌లోనూ తనదైన నటనతో విపరీతమైన అభిమానులను సంపాదించుకున్నారాయన. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో విజయ్ సేతుపతి తన బాల్యం, కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించాడు.

**నాన్న పక్కనే కూర్చునేవాడిని**

చిన్నప్పుడు మేము చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాం. మా నాన్న మా కోసం చాలా అప్పులు చేశాడు. అవి కట్టేందుకు చాలా ఇబ్బంది పడ్డాం. ఒక్కోసారి అప్పులు కట్టలేదని మా ఇంటిపైకి దాడికి వచ్చేవాళ్లు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని. మా నాన్నకు ఒక అలవాటు ఉండేది. ప్రతి రోజు రాత్రి 9.30 గంటలకు బుల్లెట్ బండిపై ఇంటికి వస్తూ.. ఫ్రైడ్ రైస్ తీసుకొచ్చేవాడు. మాతో షేర్ చేసుకొని తినేవాడు. అది నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం.


**డబ్బుల కోసం సినిమాల్లోకి వచ్చా**

నటుడు అవ్వాలనేది నా లక్ష్యమే కాదు. కేవలం కుటుంబ బాధ్యతలు, ఆర్థిక అవసరాల కోసమే నేను సినిమాల్లోకి వచ్చా. మొదట్లో సినిమాల్లో నటించడం నచ్చేది కాదు. కష్టపడి పని చేయడం అంటే చాలా ఇష్టం. ఏ పని అయినా సరే గౌరవంగా చేయడం నా అలవాటు. సినిమాల్లోకి రాకముందు దుబాయ్‌లో అకౌంటెంట్‌గా పని చేశా. స్కూల్ ఏజ్‌లో కూలీ పనికి వెళ్లాను. రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్ ఫుడ్ జాయింట్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా ఇలా చాలా పనులు ఇష్టంలో చేశాను.

**అలా సినిమాల్లోకి..**

‘దుబాయ్ నుంచి ఇండియా తిరిగి వచ్చాక నాటక రంగం వారితో పరిచయం ఏర్పడింది. ఆ అనుభవంతోనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ నటుడిగా మారాను’అని విజయ్ చెప్పుకొచ్చాడు. ‘తెన్మేర్కు పరువకాట్రు’ చిత్రంతో హీరోగా మారిన ఆయన.. ఆ తర్వాత ‘సూదు కావ్వుమ్’, ‘విక్రమ్ వేద’ ‘మహారాజా’ వంటి వైవిధ్యమైన చిత్రాలతో అగ్ర నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన హీరోగా నటించిన ‘ట్రైన్’, ‘స్లమ్ డాగ్’ సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

# నేను హీరో మెటిరియల్ కాదు.. ఆ సినిమా చేయను అని చెప్పా.. జగపతి బాబు..



తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న నటుడు జగపతిబాబు. ప్రస్తుతం సహాయ నటుడిగా రాణిస్తున్న ఆయన.. ఇప్పుడు ప్రధాన పాత్రలో నటించిన సినిమా వదలా. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను హీరో మెటీరియల్ కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరో అనే ట్యాగ్‌ను తాను నమ్మనని, సినిమా టైటిల్స్, హీరో ఇమేజ్ వంటి వాటి గురించి లెక్కలు వేసుకోనని ఆయన స్పష్టం చేశారు. “నేను ఎప్పుడూ పెద్ద హీరోని కాను. ఏదో ఇమేజ్ ఉంటుంది, కానీ నా ప్రకారం ఇమేజ్ అనేది ఏమీ కాదు. ఒకే ఇమేజ్‌తో ఎన్ని సినిమాలు చేస్తాం? ఎక్కడో ఆగిపోతాం. అసలు నేను హీరో కాన్సెప్ట్‌ను నమ్మను. హీరో అనేది కేవలం ఒక ట్యాగ్ మాత్రమే. జీవితంలో హీరోగా ఉండాలి కానీ, సినిమాల్లో కాదు” అని జగపతిబాబు అన్నారు. సినిమాల్లో హీరోగా వచ్చిపోయే పాత్రల మాదిరిగానే జీవితంలో సంతోషం, బాధ వంటివి కూడా తాత్కాలికమేనని, అవి వచ్చిపోతుంటాయని చెప్పుకొచ్చారు. తన చిన్నతనం నుంచే అన్నింటినీ వదిలేయడం, సరెండర్ అవ్వడం అలవాటు చేసుకున్నానని జగపతిబాబు పేర్కొన్నారు. “అన్నీ సరెండర్, సరెండర్, సరెండర్, సబ్మిషన్, వదిలేయడమే. ఎందుకంటే దట్ ఈజ్ ద వే లైఫ్ ఈజ్. ఇప్పుడు వదలాలి. ఇప్పుడు హ్యాపీనెస్, శాడ్ నెస్ అన్నీ కూడా టెంపరరీయే. వచ్చి పోయే. ఇవి కూడా అంతే” అని ఆయన తన తత్వాన్ని తెలియజేశారు. హీరోగా కెరీర్ ముగిసిన తర్వాత నెక్స్ట్ ఏమిటి అనే ప్రశ్న తనకు చాలా సింపుల్‌గా మారిందని, తాను పరిశ్రమలోకి రాకముందే ఆ హీరో ట్యాగ్‌ను డ్రాప్ చేశానని తెలిపారు. అయితే, నిర్మాతలు కోరడం వల్ల కొన్ని సినిమాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ప్రవరాఖ్యుడు సినిమా సమయంలో జరిగిన ఒక సంఘటనను ఆయన వివరించారు. అది 2009 నాటి విషయం అని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను రాజరవీంద్రకు చెప్పానని, “నా మీద తొమ్మిది కోట్లు పెట్టి సినిమా చేస్తే అది వర్కౌట్ కాదు. 100% డబ్బులు పోతాయి” అని స్పష్టంగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అప్పుడు రాజరవీంద్ర, “సార్, మీకు ఉన్న ఒక సినిమా అది. అది కూడా వదులుకుంటారా? డ్రాప్ చేస్తారా?” అని అడిగారని తెలిపారు. అందుకు తాను, “డబ్బులు కూడా పోతాయి కదా? వాట్ ఈజ్ ద పాయింట్? ఎవడో కొన్నప్పుడు ఆ సినిమా డబ్బులు తీసుకున్నప్పుడు అది ఫ్లాప్ కింద లెక్కే కదా?” అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు. అప్పటికే తాను హీరో మెటీరియల్ కానని, ఆ చాప్టర్ ముగిసిందని అంగీకరించానని జగపతిబాబు వెల్లడించారు. గతంలో గుమ్మడి గారు, కాంతారావు వంటి నటుల గురించి ప్రస్తావిస్తూ, ఒకే రకమైన పాత్రలు లేదా ఇమేజ్ వస్తే ఆ ముద్ర పడిపోతుందనే భయం తనలో లేదని జగపతిబాబు స్పష్టం చేశారు. అందుకే, క్యారెక్టర్ రోల్స్, మల్టీస్టారర్లలో నటించడానికి తనకు ఎటువంటి భయం లేదని, “మళ్లీ క్యారెక్టర్ ఇస్తారేమో, హీరో ఇవ్వరేమో” అనే ఆలోచన తనకు లేదని అన్నారు. జీవితం చాలా సింపుల్‌గా ఉంటుందని, దానిని అంతే సింపుల్‌గా చూడాలని అన్నారు.




## మహాప్రభు జగన్నాథ్ సినిమా రిలీజ్‌పై స్టే.. సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ

న్యూఢిల్లీ: ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోరారు. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు. చిత్రంలో జగన్నాథుడి బాల్యం, డైలాగ్‌లు, సాహసాలు, యుద్ధ సన్నివేశాలు చూపించిన తీరును తప్పుపట్టారు. ఆ సన్నివేశాలన్నీ స్కంద పురాణం, బ్రహ్మ పురాణం, సనాతన ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు పిటీషన్‌లో అభ్యంతరాలు తెలిపారు.

# ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి

పవిత్ర భూమి పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా 20 రాష్ట్రాల్లో అత్యాధునికంగా ఆధునీకరించిన 75 రైల్వేస్టేషన్లను ప్రధాని మోదీ జలంధర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.5,470 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన మోదీ ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో పంజాబ్‌లో అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లో మార్పును తీసుకురావడం కేవలం బీజేపీ వల్ల సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. సుసంపన్నమైన పంజాబ్ నిర్మాణానికి కేంద్రం అంకితభావంతో పనిచేస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. పంజాబ్‌లో ఈరోజు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని రహస్యమేమీ కాదు. ఇక్కడ జరుగుతున్న ద్రోహపూరితమైన వాస్తవాలను ప్రకటనల ముసుగులో దాచేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఎప్పుడు, ఎక్కడ గ్యాంగ్ వార్స్ భగ్గుమంటాయో, ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారాలు చేయడం కష్టంగా మారింది. చివరికి పోలీసు స్టేషన్లకు కూడా రక్షణ లేదు. వాటిపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. అత్యంత విషాదకరమైన విషయం ఏంటంటే పంజాబ్ భవిష్యత్తు



నాశనమవుతోంది. డ్రగ్స్ విక్రేతలు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనాల ఊబిలోకి నెట్టేస్తున్నారు."

**'కట్టర్ బేమాన్' పార్టీ**

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని 'కట్టర్? బేమాన్ పార్టీ'(అత్యంత అవినీతిపూరిత పార్టీ)గా మోదీ విమర్శించారు. "ప్రజలకు సేవ చేయాలంటే నిజాయతీ ఉద్దేశాలు, సమగ్రతా స్ఫూర్తి అవసరం. అయితే, పంజాబ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీకి ఈ రెండూ లేవు. దానిని కట్టర్ బేమాన్ పార్టీ అని పిలుస్తారు" అని మోదీ అన్నారు. పంజాబ్ యువతకు అత్యంత తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆరోపించారు. పంజాబ్ భవిష్యత్తు నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల వ్యాపారులు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనం అనే చిత్తడిలోకి లాగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిజాయతీ, సమగ్రత కొరవడ్డాయని మోదీ అన్నారు.

**కేంద్ర నిధుల దుర్వినియోగం**

కేంద్రం ఏళ్ల తరబడి పంజాబ్‌కు భారీ మొత్తంలో డబ్బు పంపిందని, అయితే ఆ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. " పంజాబ్ ప్రజలు తమ పథకాలన్నింటి నుంచి ప్రయోజనం పొందేలా కేంద్ర ప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. అయినప్పటికీ, ఈ 'కట్టర్ బేమాన్ పార్టీ' పాలనలో దోపిడీ ఆట సాగుతోంది. గత 12 ఏళ్లలో కేంద్రం పంజాబ్‌కు లక్షల కోట్ల రూపాయల నిధులను పంపింది. పంజాబ్ ప్రభుత్వం ఆ డబ్బును సక్రమంగా వినియోగించడంలో విఫలమైంది. పంజాబ్ పేరుతో రుణాలు తీసుకుంటున్నారు. ఈ అప్పుపై వడ్డీ చెల్లింపులకే రాష్ట్ర బడ్జెట్ ఖర్చవుతుండగా, ప్రభుత్వాన్ని నడుపుతున్న వారు అదే డబ్బుతో విలాసవంతంగా జీవిస్తున్నారు" అని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ అధికారులపై దాడి, దోపిడీకి పాల్పడినందుకు ఆప్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గుజరాత్ కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు గురించి మోదీ ప్రస్తావించారు. "కొద్ది రోజుల క్రితమే గుజరాత్‌లోని ఒక కోర్టు వారి ఎమ్మెల్యేలలో ఒకరికి 7 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, దోపిడీకి పాల్పడినందుకు ఈ శిక్ష విధించారు. దోపిడీ, అక్రమ ఆక్రమణలు వారి రాజకీయ వ్యవస్థకు గుర్తులుగా మారాయి. ఇలాంటి అనేక కేసుల్లో చాలా మంది ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. పంజాబ్‌నే చూడండి, ఆరోగ్య మంత్రిగా నియమితులైన వ్యక్తిని లంచం కారణంగా తొలగించాల్సి వచ్చింది. ఒక మంత్రి మనీలాండరింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వారి ఎమ్మెల్యేలు లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారు. మనం ఇలా లెక్కపెడుతూ పోతే, వారి ప్రభుత్వంలో, పార్టీలో ఎలాంటి మచ్చలేని వారు చాలా తక్కువ మందే మనకు కనిపిస్తారు" అని మోదీ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ గత వాగ్దానాలు, పనితీరును విమర్శిస్తూ, ఆ పార్టీ అసలు రంగులు ఇప్పుడు అందరికీ కనిపించాయని అన్నారు.

# ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఎన్?డీఏ ప్రభుత్వం వ్యూహరచనను వేగవంతం చేసింది. ఈ క్రమంలో దిల్లీలోని కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. జులై 20న జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన విధివిధా నాలు, రెండు ఆర్డినెన్స్‌లను చట్టాలుగా మార్చడంపై ఎన్‌డీఏ కూటమి చర్చించింది. ముఖ్యంగా ఆదాయపు పన్నుసవరణ బిల్లు, గతంలో నెగ్గని డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్ ముందుకు తెచ్చేందుకు ఎన్?డీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పశ్చిమాసియా ఘర్షణల్లో భారతీయ నావికుల మృతి, అయోధ్య రామాలయ విరాళాల్లో అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' పేరు**

జులై 21న జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' అని ఎన్?డీఏ పేరు పెట్టింది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన ఎన్?డీఏ ఎంపీలందరూ హాజరుకానున్నారు. ప్రభుత్వ శాసనపరమైన అజెండా నేపథ్యంలో ఎన్?డీఏ నాయకుల ఈ సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గతంలో ప్రకటించినట్లుగా, ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో పలు ముఖ్యమైన బిల్లులను చేపట్టే అవకాశం ఉంది.

ఇదిలా ఉండగా, డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల పునర్విభజనపై కేంద్రం బిల్లు పెడితే అధ్యయనం చేసి, తమిళనాడు ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బిల్లు పరిధి, లక్ష్యాలు తెలిసిన తర్వాత విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు తెలిపాయి.



తమిళనాడు ప్రయోజనాలు కాపాడేందుకు డీఎంకే తీసుకునే నిర్ణయం స్వతంత్రంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వివరించాయి. డీలిమిటేషన్‌పై వర్షాకాల సమావేశాల్లో పెట్టే బిల్లు స్వతంత్ర చట్టంగానే ఉండే అవకాశం ఉందని, ఇతర చట్టాలతో కలిపి ఉండదని భావిస్తున్నట్లు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపు, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల పంపిణీ నిష్పత్తిని అలాగే కొనసాగించడం తదితర వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పేర్కొన్నాయి. జులై 16న జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో డీలిమిటేషన్‌పై చర్చ జరిగింది. లండన్‌లో ఉన్న డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. హస్తం పార్టీతో పొత్తులేనందున బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగానే నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు వివరించాయి.

**డీఎంకే, ఇండి కూటమిపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు**

మరోవైపు, డీఎంకే, ఇండి కూటమికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్? మాట్లాడారు. "బీజేపీ, డీఎంకేల సిద్ధాంతాలు వేర్వేరు కాబట్టి అవి ఎప్పటికీ కలిసి పనిచేయలేవు. 8వ తేదీన జరిగిన ఇండి కూటమి సమావేశానికి డీఎంకే హాజరుకాలేదన్నది, అలాగే మేము టీవీకేకి మద్దతు ఇస్తున్నామన్నది వాస్తవమే. ప్రభుత్వంలో మాకు ఇద్దరు కేబినెట్ మంత్రులు కూడా ఉన్నారు. మేం డీఎంకే ఎంపీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, చర్చలు కొనసాగుతున్నాయి. డీఎంకే ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీయే తప్ప, అధికార పక్షం లేదా ఎన్?డీఏలో భాగం కాదు. స్టాలిన్ చేసిన ప్రకటనలను నేను చదివాను, బీజేపీ, డీఎంకేల మధ్య ఎలాంటి ఒప్పందం లేదని స్పష్టమవుతోంది. సరైన సమయం వచ్చినప్పుడు డీఎంకే కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందని నాకు నమ్మకం ఉంది" అని జైరాం రమేశ్? వ్యాఖ్యానించారు.

## పౌరసత్వ నిర్ధారణకు ఆ పత్రాలు చెల్లవు



పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి కేవలం భూమి లేదా ఆస్తి పత్రాలు మాత్రమే సరిపోవని కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చట్టవిరుద్ధమైన చొరబాటు ఆరోపణల ఉన్నప్పుడు ఇలాంటి పత్రాలకు ఎటువంటి చట్టపరమైన బలం ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. దేశంలో పౌరసత్వ నిర్ధారణకు సంబంధించి అనుసరిస్తున్న న్యాయపరమైన వైఖరిని ఈ తీర్పు మరోసారి ప్రతిబింబించింది. చొరబాటుదారుడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్ పోలీసులు నసీర్ మొల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. రాష్ట్రంలో తాను భూమి కొనుగోలు చేశానని, కాబట్టి తనను భారత పౌరుడిగా గుర్తించాలని కోరుతూ అతని బంధువులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలను విన్నది. అయితే, విచారణలో తాను విదేశీయుడినని నిందితుడే స్వయంగా అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో, ఆస్తి పత్రాలను పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని తేల్చి చెప్పిన కోర్టు, తగిన ఆధారాలను 2026 జూలై 20లోగా సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అంతవరకు నసీర్ మొల్లా డిటెన్షన్ సెంటర్‌లోనే కొనసాగుతారని స్పష్టం చేసింది. భారతదేశంలో ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాన్ కార్డు లేదా నివాస ధ్రువపత్రాలను పౌరసత్వానికి ప్రామాణికమైన ఆధారాలుగా పరిగణించలేమని గతంలో గౌహతి హైకోర్టు వంటి న్యాయస్థానాలు కూడా స్పష్టం చేశాయి. 1955 పౌరసత్వ చట్టం నిబంధనల ప్రకారమే పౌరసత్వాన్ని నిర్ధారించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా న్యాయ నిపుణులు గుర్తుచేస్తున్నారు.

## మెక్సికోలో భారీ భూకంపం..




మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి. "మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు. గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గర్జన)' కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. దేశంలో విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ, పేపర్ లీక్స్, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఇది రాజకీయ సభ కాదని, విద్యార్థుల భవిష్యత్తు, వారి పోరాటం, విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశం అని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రస్తుతం నాలుగు ప్రధాన సమస్యల్ని, అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. మొదటిది చదువులకు ఖర్చు భారీగా పెరగడం, రెండోది యువతకు అందుబాటులో ఉండే 5 అవకాశాల్లో నాలుగు మార్గాల తలుపులు మూసుకుపోవడం, మూడోది వందలాది మంది పోటీపడినా ఒకరికో, ఇద్దరికో విజయం దక్కడం, నాలుగోది అత్యంత ప్రమాదకరమైన పేపర్ లీకులు అని పేర్కొన్నారు. వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఉపాధి లేకపోవడానికి కారణాలివే!**

దేశంలో యువతకు ప్రతి 5 అవకాశాలకు 4 అవకాశాల తలుపులు మూసుకుపోయాయి. మొదటిది, భారతదేశంలో తయారీ రంగం పూర్తిగా నిలిచిపోయింది. చైనా ఉత్పత్తులే భారత మార్కెట్‌ను ఆక్రమించడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయి. రెండోది- వ్యాపారం చేయాలనుకునే యువతకు బ్యాంక్ రుణాలు సులభంగా అందట్లేదు. బ్యాంక్ నిధులు కొద్ది మంది పెద్ద పారిశ్రామిక వేత్తలకే పరిమితమయ్యాయి. మూడోది- కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ, కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయి. నాలుగోది- ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఆ తలుపులు కూడా మూసేశారు. చివరగా ప్రభుత్వ ఉద్యోగాలే యువతకు మిగిలిన చివరి అవకాశం అయింది. అంతా ఈ డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. అయితే కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తున్నప్పటికీ, చివరికి కొద్దిమందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సుమారు 6 కోట్ల మంది ఈ ఒక్క డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. కానీ అందులో లక్షల మందికే అవకాశం వస్తోంది. మిగిలిన వారు నిరాశకు గురవుతున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతతో పాటు విద్య ఖర్చు, పేపర్ లీక్స్ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి.' అని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు.

దేశంలోని పరీక్షల నిర్వహణ వ్యవస్థ, పేపర్ లీక్‌లపై ఈ వేదికగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పరీక్ష ప్రశ్నపత్రాల లీక్స్ కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాలు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారంలలో అందుబాటులో ఉంటున్నాయని, అయితే వాటిని పొందాలంటే కోట్ల రూపాయలు చెల్లించే స్థోమత ఉండాలని వ్యాఖ్యానించారు. ఇదే ప్రస్తుతం భారతదేశ విద్యా వ్యవస్థ పరిస్థితి అని దుయ్యబట్టారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, సగటున ప్రతి నెల ఒక పేపర్ లీక్ అయినట్లేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని వ్యాఖ్యానించారు. వరుస పేపర్ లీక్స్ జరుగుతున్నా ఇప్పటికీ ఒక్క కేసులో కూడా శిక్ష పడలేదని, ఒక్క వ్యక్తి కూడా జైలుకు వెళ్లలేదని రాహుల్ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దందా మరింత పెరుగుతోందని అన్నారు.

**'పేపర్ లీక్స్‌తో నిజాయతీ విద్యార్థులకే నష్టం'**

'వ్యవస్థను కేవలం ఒక శాతం మంది మాత్రమే దుర్వినియోగం చేస్తున్నారు. కానీ దాని ప్రభావం నిజాయతీగా చదివే 99.9 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతోంది.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇక విద్యార్థుల ముందున్న రెండు మార్గాల్ని వివరిస్తూ- ఒకటి నిజాయతీ, కష్టపడి చదివే మార్గమైతే; మరొకటి డబ్బు, అవినీతి, మోసాల ద్వారా పేపర్ లీక్ మార్గం అని వ్యాఖ్యానించారు. ఈ మార్గంలో వెళ్లాలంటే- మధ్యతరగతి లేదా పేద కుటుంబానికి చెందినవారిగా ఉండకూడదని, నిజాయతీ అవసరం లేదని అన్నారు. అయితే 99.9 శాతం మంది విద్యార్థులు నిజాయతీ మార్గాన్నే ఎంచుకుంటున్నారని, కొందరు మాత్రమే వ్యవస్థను దుర్వినియోగం చేసి అందరినీ నష్టపరుస్తున్నారని అన్నారు.

## ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి

ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ప్రకటించే 'ఉచిత పథకాల' అంశం మరోసారి సుప్రీంకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. ప్రజాధనంతో అర్థరహితంగా ఇచ్చే ఉచిత హామీలు లేదా పంపిణీ చేసే రాజకీయ పార్టీల గుర్తును స్వాధీనం చేసుకోవాలని, అవసరమైతే వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) త్వరగా విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని న్యాయవాది, పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై ఇప్పటికే 2022లో కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఫిబ్రవరి 5న కూడా అత్యవసర విచారణ కోసం ఈ అంశాన్ని ప్రస్తావించామని, మార్చిలో విచారణకు అంగీకరించినప్పటికీ ఇంకా జాబితాలోకి రాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ప్రస్తుతం కోర్టులో భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశం కొంతకాలం వేచి ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో విచారణకు వెంటనే తేదీ ఖరారు కాలేదు. దీనికి స్పందించిన అశ్విని ఉపాధ్యాయ్, ఈ సమస్య దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుందని, దీనిపై అధ్యయనం చేసేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాలు కూడా దీనికి అంగీకరించాయని ఆయన ధర్మాసనానికి వివరించారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా ఈ పిటిషన్‌పై త్వరిత విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు.

**2022లోనే నోటీసులు**

ఇదే అంశంపై 2022 జనవరి 25న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలు దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో వివరించాలని కోరింది. ఆ సమయంలో ధర్మాసనం ఈ అంశాన్ని "తీవ్రమైన సమస్య"గా అభివర్ణించింది. కొన్ని రాష్ట్రాల్లో ఉచిత పథకాల కోసం కేటాయిస్తున్న నిధులు సాధారణ బడ్జెట్ కంటే ఎక్కువగా మారుతున్నాయని కూడా వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రజాధనంతో సంబంధం లేని ఉచిత వస్తువులు, సేవలను ప్రకటించడం ద్వారా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను దెబ్బతీస్తుందని పిటిషనర్ వాదించారు. అందుకే ఎన్నికల ముందు ఇలాంటి ఉచితాలను ప్రకటించే లేదా పంపిణీ చేసే పార్టీల ఎన్నికల గుర్తును రద్దు చేయాలని, అవసరమైతే పార్టీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ప్రత్యామ్నాయంగా, ఈ అంశంపై స్పష్టమైన చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. 1968లో రూపొందించిన 'ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్'లో సవరణలు చేయాలని కూడా పిటిషన్?లో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజాధనంతో ఉచితాలు ప్రకటించకూడదనే నిబంధనను రాజకీయ పార్టీల గుర్తింపుకు సంబంధించిన అర్హతల్లో చేర్చాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు.

**రాజ్యాంగ విరుద్ధమని వాదన**

ప్రజా ప్రయోజనాలకు సంబంధం లేని వస్తువులు లేదా సేవలను ప్రజాధనంతో వాగ్దానం చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)తో పాటు ఆర్టికల్స్ 162, 266(3), 282లను కూడా ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజాధనాన్ని ఎన్నికల లబ్ధి కోసం వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వాదించారు. అధికారంలో కొనసాగాలనే ఉద్దేశంతో ప్రజాధనాన్ని వినియోగించి ఉచితాల హామీలు ఇవ్వడం, ఓటర్లకు లంచం ఇచ్చినట్లేనని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, అలాంటి ప్రక్రియను డబ్బు, ఉచిత హామీలతో ప్రభావితం చేయడం అత్యంత ప్రమాదకర ధోరణి అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137